కుప్పం అభివృద్ధిని తిరిగి పట్టాలెక్కిస్తా



వైసీపీ పాలనలో నాశనం చేశారు

బహిరంగ సభలో చంద్రబాబు



కుప్పం, మార్చి 25: 'కుప్పం అభివృద్ధికి 35 ఏళ్ల పాటు నేను పడిన కష్టాన్ని కేవలం ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వనాశనం చేశారు. అధికారంలోకి రాగానే తిరిగి అభివృద్ధిని పట్టాలెక్కిస్తా'నని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనికి అవసరమైన అన్ని ప్రణాళికలు రచించి అమలు చేస్తామని చెప్పారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ఆయన కుప్పం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆర్టీసీ బస్టాండు సర్కిల్లో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో రెండంకెల అభివృద్ధి సాధిస్తే, కుప్పంలో మూడంకెల అభివృద్ధి తీసుకొస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఇంకా ఏం చెప్పారంటే..

శాటిలైట్ టౌన్‌షిప్‌గా కుప్పం

కుప్పాన్ని శాటిలైట్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేస్తా. తమిళనాడు, బెంగళూరుతో అనుసంధానం చేయడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతా. మేజర్ పంచాయతీకి రూ.కోటి, మైనర్ పంచాయతీకి రూ.రెండు కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించి నిరంతర అభివృద్ధికి బాటలు వేస్తా. నేను చేసే అభివృద్ధి పనులకు ఈ నిధులు అదనం.

ఎడ్యుకేషన్ హబ్‌గా..

ప్రభుత్వ రంగంలోనూ పలు ఉన్నత విద్యా సంస్థలు ఏర్పాటు చేస్తా. దేశంలోని నలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడ వచ్చి చదువుకునేలా ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా. తద్వారా స్థానిక ప్రజల జీవన భృతి పెంచుతా.

వన్యప్రాణుల నుంచి పంటలకు రక్షణ

టీడీపీ హయాంలో ఏనుగులు, ఇతర వన్యప్రాణుల కట్టడికి ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్తు కంచె, కందకాల నిర్వహణను జగన్‌రెడ్డి గాలికి వదిలేశారు. దీనివల్ల ఈ ఐదేళ్లలో వేల ఎకరాల పంట నష్టంతోపాటు కొందరు రైతులూ ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది.నేను అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పొరపాట్లను సరిదిద్దుతా.

మహిళా సాధికారతకు ఇక్కడినుంచే శ్రీకారం

కుప్పం, మార్చి 25: 'మీ కష్టాలు చూశా. కరిగిపోయా. వాటి నుంచి బయట పడేయాలన్న ప్రధాన ఉద్దేశంతోనే మహిళా సాధికారత కల్పించాలని పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కుప్పంనుంచే శ్రీకారం చుట్టాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కుటుంబ మహిళా సాధికారతా సభ్యుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంలో తాను అధికారంలో ఉన్నప్పుడు మహిళలకోసం అమలు చేసిన పథకాల గురించి చంద్రబాబు వివరించారు. ఇప్పుడు అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధికింద ప్రతి మహిళకు రూ.15 వేలు, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి పలు పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మహిళల ఆదాయాన్ని రెండు రెట్లు పెంచడానికి హామీ ఇస్తున్నానని తెలిపారు.

మగాళ్లకు చెప్పి ఓట్లేయించండి

'టీడీపీ వల్ల మీకు ఎంతో మేలు జరిగింది. ఆ నిజం మీకు తెలుసు. అందువల్ల ఎన్నికల్లో టీడీపీకి ఓటేయమంటూ ఇంట్లో మగాళ్లను డిమాండు చేయండి. లేదంటే భోజనం పెట్టేది లేదని చెప్పండి. మీ భవిష్యత్తుకోసం, రాష్ట్రం కోసం 40 రోజులపాటు పనిచేయండి' అని పిలుపునిచ్చారు. వైసీపీ దుర్మార్గ పాలనలో ఆడబిడ్డలకు రక్షణ కరవైందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి తాగి, తల్లీబిడ్డలకు తేడా లేకుండా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. డ్రగ్స్ మాఫియానూ ప్రస్తావించారు. ఆడబిడ్డల జోలికొస్తే అదే ఆఖరి రోజు అన్నంతగా పాలన సాగిస్తానని హామీ ఇచ్చారు. 'మీరంతా రాజకీయాల్లోకి రావాలి. ఆ వేగానికి మగవాళ్ల కుర్చీలు వెదుక్కోవాలి' అంటూ చంద్రబాబు చమత్కరించారు.



రేపటినుంచీ చంద్రబాబు ప్రజాగళం సభలు

పలమనేరు బహిరంగసభతో ప్రారంభం

అదే రోజు పుత్తూరు, మదనపల్లెల్లో కూడా

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 27వ తేదీ బుధవారం నుంచీ ప్రజాగళం పర్యటన చేపట్టనున్నారు. రోజూ మూడు నుంచి నాలుగు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు. ప్రజలు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందులు పడుతున్నారో తెలుసుకుని.. వారి గళాన్ని రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశం.బుధవారం ఉదయం 9.30గంటలకు పలమనేరు నుంచీ ప్రజాగళం పర్యటన మొదలు పెట్టనున్నారు. తొలిరోజు పలమనేరుతో పాటు పుత్తూరు, మదనపల్లెల్లో కూడా పర్యటించనున్నారు. బుధవారం కుప్పం నుంచీ పలమనేరు చేరుకుని ఉదయం ప్రజాగళం తొలి బహిరంగసభలో పాల్గొంటారు. అక్కడ నుంచీ రోడ్డుమార్గాన పుత్తూరు పట్టణం చేరుకుని మధ్యాహ్నం 3 గంటలకు రోడ్‌షో అనంతరం బహిరంగ సభల్లో పాల్గొంటారు. అనంతరం పుత్తూరు నుంచీ హెలికాప్టర్‌లో మదనపల్లె చేరుకుని రాత్రి 7 గంటలకు జరిగే బహిరంగసభలో పాల్గొంటారు.ప్రజాగళం బహిరంగసభ విజయవంతానికి నగరి టీడీపీ ఇంచార్జి గాలి భానుప్రకాష్‌తో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాలైన జీడీనెల్లూరు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఇంచార్జులు, అభ్యర్థులు డాక్టర్ థామస్, పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం కృషి చేస్తున్నారు. భారీ జనసమీకరణపై వీరంతా దృష్టి పెట్టారు. ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక జిల్లాలో అధినేత పాల్గొంటున్న తొలి బహిరంగసభ కావడంతో దీన్ని పార్టీ నేతలు, శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా పరిగణిస్తున్నాయి. దీంతో తొలి బహిరంగసభను నభూతో అన్న రీతిలో నిర్వహించేందుకు పార్టీ నేతలు శ్రమిస్తున్నారు.

నేడు సుప్రీం సీజే తిరుపతి రాక

ఎస్వీయూలో వర్క్‌షాప్‌కు హాజరు

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి ధనుంజయ వై చంద్రచూడ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం తిరుపతి రానున్నారు. కలెక్టరేట్‌కు అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం 9 గంటలకు బెంగళూరు నుంచీ విమానంలో బయల్దేరి 10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు తిరుపతి ఎస్వీయూలో లా కోర్సులు ప్రారంభించి పదేళ్ళవుతున్న సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ లీగల్ ఎడ్యుకేషన్ (న్యాయవిద్యలో కృత్రిమ మేధ) అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాపును ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించి న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులు మహాలక్ష్మీ పావని, జేబీ గుప్తా తదితరులు కూడా హాజరు కానున్నారు.రాత్రి 8 గంటలకు బయల్దేరి తిరుమల చేరుకునే సీజే రాత్రికి అక్కడే బస చేస్తారు. బుధవారం వేకువ జామున కుటుంబంతో శ్రీవారిని దర్శించుకుని ఉదయం 9 గంటలకు బయల్దేరి తిరుపతి చేరుకుంటారు. 11.30 గంటలకు విమానంలో బయల్దేరి హైదరాబాదు వెళ్ళనున్నారు.

నేడు తిరుమలకు చిరంజీవి

తిరుపతి అర్బన్, మార్చి 25: ప్రముఖ సినీనటుడు చిరంజీవి, ఆయన తనయుడు రాంచరణ్ కుటుంబ సభ్యులతో మంగళవారం తిరుపతికి రానున్నారు. ప్రత్యేక విమానంలో సాయంత్రం 4గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుమల చేరుకుని రాత్రికి బసచేస్తారు. బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. సాయంత్రం హైదరాబాదుకు తిరుగుప్రయాణమవుతారు. బుధవారం రాంచరణ్ జన్మదినం సందర్భంగా తిరుమల పర్యటనకు వస్తున్న వారికి స్వాగతం పలికేందుకు మెగా అభిమానులు, జనసేన సైనికులు విమానాశ్రయానికి రావాలని అఖిలభారత చిరంజీవి యువత ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు పూల ప్రభాకర్ ఓ ప్రకటనలో కోరారు.

ఓటరు జాబితాలో మీ పేరుందా?

- కొత్తగా నమోదుకు ఏప్రిల్ 15 వరకు గడువు
- చిరునామా మార్పుకైతే అవకాశం లేదు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలంటే ఓటరు జాబితాలో పేరుందో.. లేదో చూసుకోవాలి. జనవరిలో విడుదల చేసిన తుది జాబితాకు అదనంగా ఇటీవల నమోదు చేసుకున్న ఓటర్ల పేర్లను సైతం చేర్చారు. 18 ఏళ్ల నిండినవారు ఏప్రిల్ 15వ తదీలోపు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ గడువు ఇచ్చింది. అడ్రస్ మార్పునకు(షిప్టింగ్)కు అవకాశం లేదు. ఒకవేళ పేరులో తప్పుంటే సరిచేసుకోవచ్చు. జిల్లాలో తుది జాబితా తర్వాత ఇటీవల ప్రకటించిన ఓటర్ల సంఖ్య 17,94,730కు చేరుకుంది. తుది జాబితాను పోలింగ్ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినప్పటికీ చాలామంది చూసు కోలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో జాబితాలో ఓటు ఉందా లేదా అనేది పరిశీలించుకోవాలని అధికారులు కోరుతున్నారు.



కొత్త ఓటరు నమోదు ఇలా

ఓటరు నమోదు అయినప్పటికీ ఎన్నికల రోజున జాబితాలో చాలా మంది తమ పేరు లేదని ఆందోళన చెందుతుంటారు. దాని బదులు ముందుగానే మన పేరు చూసుకోవడం మంచిది. ఒకవేళ పేరు కనిపించకపోతే వెంటనే కొత్తగా ఓటరు నమోదకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అర్హతను పరిశీలించి అధికారులు ఓటేసే హక్కు కల్పిస్తారు. గ్రామ, వార్డు సచివాలయం, తహసీల్దారు కార్యాలయంలోని బూత్‌స్థాయి అధికారుల(బీఎల్‌వోల)కు దరఖాస్తులు అందజేయాలి. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చు. కొత్త ఓటర్ల నమోదుకు ఏప్రిల్ 15వరకు గడువు ఇచ్చింది.

ఓటు హక్కుకు దూరంగా యువత

జిల్లాలో 18-19 ఏళ్ల మధ్య ఉన్నవారు 36,162మంది ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. జనాభా అంచనా ప్రకారం 55వేల మందికి పైగా యువత ఉండగా 18,738మంది ఓటరు నమోదుకు దూరంగా ఉన్నారు. ఇప్పటికైనా మేల్కొని ఏప్రిల్ 15లోపు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని జిల్లా అధికారులు కోరుతున్నారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లనిండిన వారు కూడా కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.


వైభవంగా తుంబురతీర్థ ముక్కోటి

24 వేల మంది భక్తుల రాక

తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లోని తుంబురతీర్థ ముక్కోటి వైభవంగా జరిగింది. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా తుంబుర తీర్థ ముక్కోటిని నిర్వహించారు. ఆదివారం 15,750 మంది, సోమవారం 8,250 మంది భక్తులు తీర్థానికి వెళ్లారు. పుణ్యస్నానాలు ఆచరించి, తుంబురనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా టీటీడీ అన్నప్రసాదాలు అందజేసింది. పలుచోట్ల షెడ్లు, మార్గం మధ్యలో నిచ్చెనలు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు.







తీర్థానికి వెళ్లివచ్చిన భక్తుడి మృతి

తుంబుర తీర్థానికి వెళ్లి వచ్చిన తమిళనాడు పెరుంగలత్తూరుకు చెందిన రామకృష్ణన్ దక్షిణ మూర్తి (50)మృతి చెందారు. తీర్థానికి వెళ్లి సాయంత్రానికి తిరుమలకు తిరిగి చేరుకున్నాడు. ఆలసటతో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయన్ను అంబులెన్స్‌లో తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

వెంకటగిరిలో వైసీపీకి భారీ షాక్

నేదురుమల్లిపై రెబెల్ అభ్యర్థిగా పోటీ చేస్తానన్న నెల్లూరు డీసీసీబీ మాజీ ఛైర్మన్ ధనంజయరెడ్డి

సేవ్ వెంకటగిరి పేరిట అనుచరులతో భారీ ర్యాలీ, సమావేశం

వెంకటగిరి, మార్చి 25 : వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీకి సొంత పార్టీ వర్గాల నుంచే భారీ షాక్ తగిలింది. పార్టీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిపై రెబెల్ అభ్యర్థిగా పోటీ చేస్తానంటూ అదే పార్టీకి చెందిన నెల్లూరు డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి ప్రకటించారు. సోమవారం నియోజకవర్గవ్యాప్తంగా ఆరు మండలాల నుంచీ భారీగా తరలివచ్చిన అనుచరులతో వెంకటగిరిలో సేవ్ వెంకటగిరి పేరిట నిర్వహించిన సమావేశంలో రామ్‌కుమార్‌రెడ్డిపై అసమ్మతి నేతలు ధనంజయరెడ్డి,కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి నిప్పులు చెరిగారు. వైసీపీలో కష్టపడ్డవారికి గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అనుభవం లేని వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించారని ఆరోపించారు. మూడు పార్టీలు మారి వైసీపీలోకి వచ్చారంటూ నేదురుమల్లిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కోసమో లేక జగన్ కోసమో నేదురుమల్లి వైసీపీలోకి రాలేదని, తన ఉనికి కోసం వచ్చాడని ఆరోపించారు. వెంకటగిరిలో కరెక్టుగా 25 మంది మున్సిపల్ కౌన్సిలర్ల పేర్లు కూడా చెప్పలేరని ఎద్దేవా చేశారు. ప్రెస్‌మీట్లు పెట్టడం తప్ప పార్టీలో నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం అతడికి తెలియద న్నారు. సమన్వయం అంటే అందరినీ కలుపుకునిపోయి పనిచేయడమని, అంత తప్ప 400 రోజుల్లో 200 ప్రెస్ మీట్లు పెట్టడం కాదని ఎగతాళి చేశారు. నియోజకవర్గానికి వచ్చాక కనీసం ఒక్క పనైనా చేశావా? ఏ ఎన్నికల్లో అయినా పనిచేశావా? అంటూ ప్రశ్నించారు. దివంగత నేదురుమల్లి జనార్దన రెడ్డి, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి నియోజకవర్గానికి చాలా మంచి చేశారని ప్రశంసిస్తూనే రామ్‌కుమార్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. వెంకటగిరిలో తండ్రి విగ్రహం పెట్టారని, విగ్రహం పెట్టక ముందు ప్రభుత్వ ఆస్తిగా వున్న ఆ స్థలం తర్వాత ప్రైవేటు ఆస్తిగా ఎలా మారిందో చెప్పాలన్నారు. వెంకటగిరిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా వారి కడుపు కొట్టారని ఆరోపించారు. మండలాలను నాశనం చేశారని, అవినీతి గురించి మాట్లాడే రామ్‌కుమార్‌రెడ్డి మామూళ్ళు తీసుకోవడం లేదా అని ప్రశ్నించారు. అనుచరులందరూ ఆశీర్వదిస్తే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిపై రెబెల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ధనంజయరెడ్డి అభ్యర్థించారు.నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో గట్టి పట్టున్న ధనంజయరెడ్డి, సీనియర్ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి తొలి నుంచీ రామ్‌కుమార్‌రెడ్డిని వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు టికెట్ ఇవ్వవద్దని పలుమార్లు అధిష్ఠానాన్ని కోరారు. అయితే పార్టీ నేదురుమల్లికే టికెట్ ఖరారు చేసి అధికారికంగా ప్రకటించేయడంతో అసమ్మతి వర్గం అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధపడింది. అందులో భాగంగా ధనంజయరెడ్డి, కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డిలు సోమవారం నియోజకవర్గవ్యాప్తంగా ఆరు మండలాల నుంచీ అనుచరులను రప్పించి వెంకటగిరిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలేరమ్మ ఆలయంలో పూజలు జరిపి ఓ కళ్యాణ మండపంలో సమావేశమయ్యారు.వెంకటగిరి ఏఎంసీ ఛైర్మన్ సింగంశెట్టి బాస్కరరావు, బాలాయపల్లి ఎంపీపీ భాస్కరరెడ్డి, వెంకటగిరి ఎంపీపీ తనూజరెడ్డి భర్త శివారెడ్డి, డక్కిలి జడ్పీటీసీ కలిమిలి రాజేశ్వరి, రాపూరు జడ్పీటీసీ ప్రసన్న, ఎంపీపీ ప్రసన్న, పెంచలకోన దేవస్థానం ఛైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి ,40మంది ఎంపీటీసీలు, 30 మంది సర్పంచులతో పాటు భారీ సంఖ్యలో అనుచరులు పాల్గొనడం గమనార్హం. ఈ క్రమంలో జగన్ ఫొటో పెట్టి సమావేశం నిర్వహించడంపై నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆర్వోకి ఫిర్యాదుచేశారు. దీంతో సీఐ సంగమేశ్వరరావుకు ఏఆర్వో ఫిర్యాదు చేయడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిని వెంటబెట్టుకొని సీఐ సమావేశం జరిగే ప్రాంతానికి చేరుకొన్నారు. అప్పటికే సమావేశం పూర్తికావడంతో వెనుదిరిగారు.





సేవ్ వెంకటగిరి సభలో మాట్లాడుతున్న ధనంజయరెడ్డి - వైసీపీ నాయకుల ర్యాలీ

రంజాన్ వేళలు

ఇఫ్తార్(మంగళవారం):సా. 6.27
సహరి(బుధవారం) : ఉ. 4.53

చంద్రగిరి

ఇరంగారిపల్లెలో టీడీపీ ప్రచారం



పాకాల, మార్చి 25: ఇరంగారిపల్లె పంచాయతీలో సోమవారం టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను అందజేస్తూ ఎమ్మెల్యేగా పులివర్తి నానీకి ఒక అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సురేష్ చౌదరి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి నాసీర్, టీడీపీ , జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగుడుపల్లెవాసులు టీడీపీలో చేరిక



చంద్రగిరి, మార్చి 25: చంద్రగిరి మండలం గంగుడుపల్లె పంచాయతీలో 10 వైసీపీ సానుభూతి కుటుంబాలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. గురవారెడ్డి, బండి బయ్యారెడ్డి, చక్రిరెడ్డి, కె.నరసింహులు, సంజీవరెడ్డి, వెంకటరమణతోపాటు 10 కుటుంబాలు టీడీపీలో చేరగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి వాసుదేవరెడ్డి, రూపకుమార్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 కోట్ల బంజరు భూమి కబ్జా



కొట్రమంగళం సమీపంలో వాగుబంజరుకు వేసిన కంచె

తిరుపతి(ఆటోనగర్), మార్చి 25: రేణిగుంట మండలంలో వైసీపీ నాయకుల భూకబ్జాలకు అంతేలేదు. రెండురోజుల క్రితం సుమారు రూ 10 కోట్ల విలువగల 10.96 ఎకరాలు కాలువ బంజరు భూమిని కబ్జా చేసి కంచె వేశారు. కొట్రమంగళం గ్రామరెవిన్యూ లెక్క దాఖలాలోని సర్వేనెంబర్ 194లో కాలువ బంజరు భూమి 10.96 ఎకరాలు ఉంది. ఈ భూమిని వైసీపీ నాయకులు రెండురోజుల క్రితం ఆక్రమించి కంచె వేశారు. ఈ విషయంపై గ్రామ రెవిన్యూ అధికారికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని కొట్రమంగళం గ్రామ రైతులు తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడే భూమి కబ్జాను అడ్డుకోవాలని రైతు రొమ్మాల దేవేంద్రనాథ్‌రెడ్డి తదితరులు కోరారు.

చిన్నారిపై అత్యాచారయత్నం

భాకరాపేట, మార్చి 25: నాలుగేళ్ళ చిన్నారిపై అత్యాచార యత్నం చేసిన ఘటన చిన్నగొట్టిగల్లుమండలంలో జరిగింది. భాకరాపేట పోలీసుల కథనం మేరకు తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఓ కూలీ నాలుగేళ్ల కుమార్తె ను తమిళనాడుకు చెందిన వేలు ఓ గుడిసెలోకి తీసుకెళ్ళి అత్యాచారానికి ప్రయత్నించాడు. చిన్నారి ఏడ్పులు విన్న ఆమె తల్లి గుడిసె లోకి వెళ్ళి చూడ్డంతో వేలు పారిపోయాడు. బాలిక తల్లితండ్రుల ఫిర్యాదు మేరు ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోదండరామాలయంలో అష్టోత్తర శతకలశాభిషేకం



తిరుపతి (కల్చరల్), మార్చి 25 : కోదండరామస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. కల్యాణ మండపంలో ఉదయం 9నుంచి 10.30 వరకు సీతారాముల ఉత్సవమూర్తులకు 108 కలశాలతో అభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం రామచంద్ర పుష్కరిణిలో స్వామి వారికి ఊంజల్ సేవ, పుష్కరిణి హారతి నిర్వహించారు. ఆలయ డెప్యూటి ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ సోమశేఖర్, చలపతి సురేష్ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై గోవిందుడు..

గోవిందరాజస్వామి ఆలయంలో పుండరీకవల్లి (సాలైనాంచియార్) అమ్మవారి పంగుణి ఉత్తర ఉత్సవం ఘనంగా నిర్వహించా రు. ఉదయం సుప్రభాత సేవ, స్నపన తిరుమంజన సేవ చేశారు. సాయంత్రం గోవిందరాజస్వామి పుండరీకవల్లి ఉత్సవమూర్తులను విమానప్రాకారంలో ఊరేగించారు. రాత్రి 9.30 గంటలకు గోవిందరాజస్వామి గరుడసేవ ఆలయ నాలుగు మాడవీధుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటి ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 25: నగరంలోని యంగ్ మైండ్స్ టెక్నాలజీ సొల్యూషన్స్ స్టార్టప్ కంపెనీ ఆధ్వర్యంలో కంపెనీ ఉద్యోగులు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సోమవారం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజ సేవ కోసం ముందుకు వచ్చిన కంపెనీ ఉద్యోగులను ఎస్పీ అభినందించారు.

ఓటర్లకు అవగాహన

తిరుపతి(నేరవిభాగం), మార్చి 25 : తిరుపతి రూరల్ పరిధిలోని ఓటర్లకు ఓటు హక్కుపై ఎమ్మార్‌పల్లి సీఐ అహ్మద్ సోమవారం అవగాహన కల్పించారు. దుర్గసముద్రం, అడపారెడ్డిపల్లి, కల్లూరు పంచాయతీల్లో ఓటు ఎలా వేయాలి...ఓటుకు నోటు తీసుకుంటే జరిగే అనర్థాలు ఏమిటి...అసాంఘిక శక్తులు కనిపిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐలు వెంకటరమణ, షేక్‌షావలి పాల్గొన్నారు.

మహాప్రభు ఆవిర్భావ దినోత్సవం



తిరుపతి (కల్చరల్), మార్చి 25: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవం హారే రామ హరే కృష్ణ మందిరంలో సోమవారం ఘనంగా నిర్వహిచారు. ఉదయం 5 గంటల నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. 5 గంటలకు మహాశంఖాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ సంచాలకులు రేవతి రమణ ప్రభు ఉపన్యాసం చేశారు. శ్రీకృష్ణుని లీలలను సరళభాషలో వివరించారు. రాత్రి 7.30 గంటలకు గరుడసేవ(శోభాయాత్ర) నిర్వహించారు.

బంగారు తిరుచ్చిపై అలమేలుమంగ అభయం



తిరుచానూరు, మార్చి 25: తిరుచానూరులో కొలువైన అలమేలు మంగ అమ్మవారు ఉత్తర ఫల్గుణి నక్షత్రం పురస్కరించుకుని బంగారు తిరుచ్చిపై కొలువుదీరి సోమవారం ఆలయ మాడవీధుల్లో ఊరే గుతూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అర్చకులు అమ్మవారికి నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార శోభితురాలైన పద్మావతి అమ్మవారు నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ మధు, శేషగిరి పాల్గొన్నారు.

వైభవంగా గరుడోత్సవం



చంద్రగిరి, మార్చి 25: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాల అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లను కల్యాణ వ ండ పానికి వేంచేపు చేసి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ మూర్తిని పట్టుపీతాంబురాలు, బంగారు ఆభరణాలతో అలం కరించి గరుడ వాహనంపై అధిష్టించగా మాడవీధుల్లో భక్త లకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ



తిరుచానూరు, మార్చి 25: తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరించి సన్నిధిలోని అమ్మవారి మూలవర్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయనను వేదపండితులు వేదాశ్వీరచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి



చంద్రగిరి, మార్చి 25: చంద్రగిరి మండలం తొండ వాడ సమీపంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... జార్ఖండ్‌కు చెందిన రాజాసింగ్ (26) చంద్రగిరిలో సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి రాజాసింగ్, మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై తిరుపతి నుంచి చంద్రగిరికి వస్తుండగా తొండవాడ సమీపానికి రాగానే పెట్రోల్ లేక ఆ వాహనం ఆగిపోయింది. దీంతో రాజాసింగ్ సమీపంలో డాబా ఉండటంతో పెట్రోల్ పట్టుకోవడానికి ఖాళీ బాటిల్ కోసం జాతీయ రహదారి దాటుకుని వెళ్లి బాటిల్ తీసుకుని తిరిగి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజాసింగ్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నేతల కన్నుసన్నల్లోనే మద్యం అక్రమ రవాణా

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 25: నాగలాపురం మండలంలో పట్టుబడ్డ మద్యం రవా ణా చేస్తున్న వాహనం వైసీపీ నేతలదేనని ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం ఆరోపించారు. బీఎన్ కండ్రిగలో సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ 60 కేసుల మద్యం బయటపడినా పోలీసులు కేసు పెట్టకపోవడం ఏమిటని ప్రశ్నిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ నాయుడు, నియోజక వర్గ నాయిబ్రహణ సంఘం అధ్యక్షుడు వేడాం వెంకటాచలం, ఎంపీటీసీ మనోహర్‌నాయుడు నాయకులు వీరరాఘవులు, శ్రీనివాసులు, సత్యనారాయణ, రవి, మునెయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి అభివృద్ధి నా బాధ్యత : నాని



తనపల్లిలో ప్రచారం చేస్తున్న పులివర్తి నాని

తిరుచానూరు, మార్చి 25: వెనుకబడిన చంద్రగిరి అభివృద్ధే నా బాధ్యత అని, ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని ఓటర్లకు పులివర్తి నాని పిలుపునిచ్చారు. సోమవారం తిరుపతి రూరల్ మండలం తనపల్లి పంచాయతీలో పులివర్తి నాని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు, రోడ్డు సమస్యలు, తుఫాన్లకు కొట్టుకుపోయిన వంతెనలు, రైతాంగ సమస్యలు పట్టి పీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక అవకాశం ఇస్తే ప్రతి ఇంటి పెద్ద కొడుకులా వెనుకబడిన చంద్రగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని వివరించారు అంతకు ముందు మసీదులో పులివర్తి నాని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం నల్లమాని కాలువ గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరడం శుభపరిణామన్నారు. వీరికి పులివర్తి నాని పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, బాలచంద్రారెడ్డి, నాగార్జున, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

రండి కలిసి పనిచేద్దాం

- వైసీపీ వర్గాలకు పులివర్తి నాని పిలుపు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 25: రండి కలిసి పనిచేద్దాం... చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడదాం అంటూ వైసీపీ నాయకులు, కార్యకర్తలకు చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని పిలుపునిచ్చారు. సోమవారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ చాలామంది వైసీపీ శ్రేణులు టచ్‌లో ఉన్నారని, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వైసీపీలోనే వర్గాలను విభజించి కొందరిని వేధించారని, వారందరూ పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వారందరికీ తాను ఆహ్వానం పలుకుతున్నట్టు చెప్పారు. రెండురోజుల ముందు భాస్కర్‌రెడ్డి తన అనుయాయులు, పార్టీ నాయకులతో సమావేశమై పార్టీ మారిన వారిపై దాడులు చేయాలని పురమాయించారని చెప్పారు. ఇలా ఆదేశించడం నీతిమాలిన చర్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులకు సేవకుల్లా పనిచేస్తున్న కొందరు అధికారుల తీరుపై ఆధారాలు సేకరిస్తున్నామని, వాటిని ఎన్నికల కమిషన్‌కు అందజేస్తామని చెప్పారు.

పొదలమాటున ఇసుక డంపింగ్

సి.గొల్లపల్లెలో వైసీపీ నాయకుల కన్నుసన్నల్లో సాగుతున్న వైనం

తిరుపతి(రూరల్),మార్చి25: తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లె పంచాయతీ పరిధిలో జనచైతన్య ప్లాట్లకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాల్లో ఇసుకను డంపింగ్ చేసి అనధికారిక వ్యాపారాన్ని సాగిస్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న స్వర్ణముఖినది నుంచి రాత్రి సమయాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను పలుచోట్ల డంపింగ్ చేసి అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఈప్రాంతంలో ముళ్లపొదలు ఎక్కువగా ఉండి.. ఎవరి కంటపడని పరిస్థితి ఉండడంతో ఇసుకాసారుల వ్యాపారం మూడుపువ్వులు..ఆరుకాసులుగా సాగుతోంది. ట్రాక్టర్‌ను అక్కడికే తీసుకెళ్లి ఇసుక తీసుకుంటే ఒకరేటు లేదా అవసరం ఉన్న చోటుకు వారు చేర్చితే మరో రేటు వసూలు చేస్తున్నారని తెలిసింది. స్థానిక వైసీపీ నాయకుల కన్నుసన్నల్లో ఈ అక్రమ ఇసుక వ్యాపారం సాగుతున్నట్లు సమాచారం. గ్రామానికి సమీపాన ఉన్న స్వర్ణముఖినదీ పరివాహక ప్రాంతం నుంచి ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేసి అనధికారిక వ్యాపారం సాగిస్తున్నా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్ఈబీ) అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మహిళలకు రక్షణ, యువతకు ఉపాధే లక్ష్యం

మంగళం, మార్చి 25: మహిళలకు రక్షణ, ఉపాధి కల్పన అనేవి తమ లక్ష్యమని తెలుగు మహిళా నాయకురాలు పులివర్తి సుధారెడ్డి తెలిపారు. సోమవారం మంగళం పరిధిలోని రణధీరపురంలో స్థానిక మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలుగుగంగ నీరు ఇస్తానని హామీ ఇచ్చి ఇక్కడ ప్రజలను మోసం చేశారన్నారు. ఈ ఐదేళ్లలో ఎమ్మెల్యే భూకబ్జాలు, అటవీ సంపదను దోచుకుంటూ ప్రజలకు డబ్బంటే లెక్కలేని విధంగా తాయిలాలు పంచుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో డబ్బుకు ఓటు అమ్ముకోకుండా అభివృద్ధి, రక్షణ కల్పించే టీడీపీకి ప్రజలు అండగా నిలబడి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల పోరాట కమిటీ న నాయకులు స్థానికంగానే ఇళ్లు ఇవ్వాలని పులివర్తి సుధారెడ్డికి వినతిపత్రం అందించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే శెట్టిపల్లి పంచాయతీలో ఇళ్లపట్టాలు పొందిన వారందరికీ స్థానికంగానే ఇళ్ల స్థలాలు చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, మహిళా అధ్యక్షురాలు రామాంజేరి మహేశ్వరి, నాయకులు ఈశ్వరయ్య, గోపీనాథ్, గాజుల రమణ, సురేష్, చంద్ర, చెన్నరాయప్ప, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, మార్చి 25: ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు, సోమవారం హోలీ పండుగ కలిసి రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ఆదివారం రాత్రి నుంచే శ్రీకాళహస్తిలో భక్తులతో వసతి గృహాలన్నీ నిండిపోయాయి. సోమవారం వేకువ జాము నుంచే భక్తులు దర్శనం కోసం క్యూ లైన్లో బారులు తీరారు. ఉదయం రాహుకాలం సమయంలో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు జరిపించుకునేందుకు భక్తులు విశేషంగా ఆసక్తిచూపారు. ఆ సమయంలో అధికంగా రద్దీ కనిపించింది. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 32వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు.



రాయలవారి మండపం వద్ద బారులు తీరిన భక్తులు

వైసీపీ నాయకుడి కారులో మద్యం సీజ్!

నాగలాపురం, మార్చి 25: నాగలాపురం మండలంలో కారులో అక్రమంగా తరలిస్తున్న 60 కేసుల కర్ణాటక మద్యాన్ని ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వజ్జావారి కండ్రిగ సమీపంలో ఆదివారం రాత్రి కారును సినీ ఫక్కీలో వెంబడించి పట్టుకున్నారు. కారుతో పాటూ ఇద్దరినీ, కారులో ఉన్న 60 కేసుల మద్యాన్ని ఎస్ఈబీ సీఐ గోపీకృష్ణ, ఎస్ఐ శశిధర్ స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడ్డ వారిలో వార్డు మెంబరైన వైసీపీ నేత కుమారుడున్నట్లు సమాచారం. దీంతో వైసీపీ నాయకులు రంగ ప్రవేశం చేసి కేసు నమోదు కాకుండా అడ్డుపడుతుండడంతో సోమవారం సాయంత్రం వరకూ కేసు నమోదు చేయలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





ఎస్ఆర్ఆర్ కండ్రిగ సర్పంచ్ జయలక్ష్మి మృతి



పాలసముద్రం, మార్చి 25: మండలంలోని ఎస్ఆర్ఆర్ కండ్రిగ పంచాయతీ సర్పంచ్ కొండూరు జయలక్ష్మి (73) సోమవారం మృతి చెందారు. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ మృతి చెందారు. సర్పంచ్ ఎన్నికల్లో జయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె కుమారుడు కె.మోహన్‌రాజు తిరుపతిలో వ్యాపారవేత్త. తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం ఉదయం ఎస్ఆర్ఆర్ కండ్రిగ గ్రామంలో నిర్వహించనున్నారు.

5 తుపాకులు మాత్రమే డిపాజిట్ చేయాల్సి ఉంది : ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), మార్చి 25: తిరుపతి జిల్లా పరిధిలో పోలీసు శాఖ నుంచి 503 ఆయుధాలకు అనుమతులున్నాయని, అందులో ఇప్పటివరకు 407 డిపాజిట్ చేశారని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఒక ప్రకటనలో చెప్పారు. 5 తుపాకులు మాత్రమే వ్యక్తిగతంగా తీసుకుని డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. మిగిలిన 91 కలెక్టర్ అనుమతితో బ్యాంకుల వద్ద ఉన్నాయన్నారు.

ఎన్నికల ఉల్లంఘనకు ముకుతాడు

- అక్రమాలకు చెక్ సి-విజిల్ యాప్
- ఫిర్యాదుల కోసం (0877-2236007) కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 25: సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతోంది. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిని కనిపెట్టి అక్రమాలకు చెక్ పెట్టేందుకు పలు రకాల యాప్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి సి-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎన్నికల ప్రలోభాలు, అక్రమాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో కోడ్ ఉల్లంఘన, ఓటర్లకు కావాల్సిన సమాచారం తెలుసుకోవడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది.

వంద నిమిషాల్లో చర్యలు..

గూగుల్ ప్లేస్టోర్ నుంచి సి-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నంబర్ రిజిస్టర్ చేసుకోవాలి. ఫోన్‌కు వచ్చిన ఓటీపీని రిజిస్టర్ చేసుకోవాలి. కోడ్ ఉల్లంఘనకు సంబంధించి ప్రత్యేక్షంగా తీసిన వీడియోలు, ఫొటోలు, ఆడియో అప్‌లోడ్ చేయవచ్చు. ఫిర్యాదు రిజిస్టర్ అయితే యూనిక్ ఐడీ నంబరు వస్తుంది. తద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో జిల్లా యంత్రాంగం పరిష్కరిస్తుంది. ఫిర్యాదుల పర్యవేక్షణకు జిల్లా వ్యవసాయాశాఖాధికారి ప్రసాదరావును నోడల్ అధికారిగా నియమించారు. ఇప్పటివరకు 182 ఫిర్యాదులు సి-విజిల్ యాప్‌కు అందాయి. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడం ఈ యాప్ ప్రత్యేకత.



సి-విజిల్ యాప్

ఎన్‌జీఎస్‌పీ : ఎన్నికల ఫిర్యాదులు, ప్రశ్నలను దాఖలు చేయడానికి నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్(ఎన్‌జీఎస్‌పీ) యాప్ దోహదపడుతుంది.

సువిధ : అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రదర్శనలు, సమావేశాలు, ఇతర ప్రచార సంబంధిత కార్యకలాపాలకు అనుమతులను అభ్యర్థించడానికి ఇది ఉపయోపడుతుంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం : ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టర్ లక్ష్మీశ నేతృత్వంలో ప్రత్యేక విభాగం ఏర్పాటైంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. దీనికి నోడల్ అధికారిగా జిల్లా ఉద్యానవనశాఖ అధికారి దశరథరామిరెడ్డిని నియమించారు. ఎవరైనా సరే 0877-2236007కు ఫోన్‌చేసి తగిన వివరాలు తెలుసుకోవడంతోపాటు ఫిర్యాదులు చేయవచ్చు. ఓటర్లు 1950 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి తగిన సమాచారం పొందవచ్చు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి, చర్యలు తీసుకునేందుకు కలెక్టరేట్‌లో ఓ బృందాన్ని నియమించారు.

దివ్యాంగుల చేయూతకు సాక్ష్యం : వయోవృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రానికి సొంతంగా రాలేని వారు ఇందులో తమపేర్లను నమోదు చేసుకోవచ్చు.వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు అధికారులు రవాణా సదుపాయాన్ని కల్పిస్తారు. ప్రత్యేకంగా సహాయకులను అందుబాటులో ఉంచుతారు. దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీని సమకూరుస్తారు. 85 సంవత్సరాలు దాటినవారు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ యాప్ నిర్వహణకు నోడల్ అధికారిగా మెప్మా పీడీ రాధమ్మను నియమించారు.

వైసీపీ నేతలు కబ్జాచేసిన భూములు
స్వాధీనం చేసుకుంటాం..

బాధితులకు తిరిగి అప్పగిస్తామన్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతిని గంజాయి కేంద్రంగా మార్చేశారని విమర్శ

సుగుణమ్మ నా సోదరి... అందరినీ కలుపుకుపోతా

బుధవారం నుంచీ ప్రచారం ప్రారంభం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : "ఐదేళ్ల వైసీపీ పాలనలో తిరుపతిని గంజాయి కేంద్రంగా మార్చేశారు. వైసీపీ ముఖ్య నేతలు భూకబ్జాలకు పాల్పడ్డారు. నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వైసీపీ నేతలు ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకుంటాం. వాటిని బాధితులకు అందిస్తాం" అని తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రకటించారు. సోమవారం సాయంత్రం ఓ ప్రైవేట్ హోటల్లో టీడీపీ-జనసేన నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. తిరుపతి నగర పవిత్రతను ఐదేళ్లలో వైసీపీ నేతలు దెబ్బతీశారని విమర్శించారు. వైసీపీ అవినీతి పాలనను అంతం చేసేందుకు యుద్ధం చేయాల్సి వస్తోందన్నారు. వైసీపీ తనకు అన్యాయం చేస్తే జనసేన పార్టీ అక్కున చేర్చుకుందని, భారీ మెజార్టీతో తనను గెలిపించి పవన్ కల్యాణ్‌కు గిఫ్ట్‌గా ఇద్దామని కోరారు. తిరుపతి టికెట్ ఆశించి పొందలేని టీడీపీ, జనసేన నేతలు అసంతృప్తిలో ఉండడం సహజమేనని, త్వరలోనే అన్నీ సర్దుకుపోతాయని చెప్పారు. గతంలో టీడీపీలో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తాను రెండుసార్లు టికెట్ పొందలేకపోయానని గుర్తుచేశారు. టికెట్ దక్కకపోతే పడే ఇబ్బంది ఏంటో తనకు కూడా తెలుసునని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తన సోదరితో సమానమని, ఆమెతో పాటు అందరినీ కలుపుకుపోతానని అన్నారు. బుధవారం కపిలతీర్థం, గంగమ్మ ఆలయాలకు వెళ్లి, అక్కడి నుంచి జీవకోనలోని జీవలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రచారం ప్రారంభిస్తామన్నారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ తమ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయానికి పార్టీ శ్రేణులు కట్టుబడి ఉండాలని, ఆరణి శ్రీనివాసులును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకుడు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయం కోసం అందరం కష్టపడదామని అన్నారు.

నీళ్లడిగితే నాలుగేళ్లుగా దిక్కులేదు..
ఓట్లడగను ఏ మొహం పెట్టుకుని వచ్చారు?

వైసీపీ నాయకులను కడిగేసిన మహిళలు



వైసీపీ నేతలను నిలదీస్తున్న మహిళలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 25 : తిరుపతిలో నాలుగు రోజులుగా వైసీపీ నాయకులు హంగు ఆర్భాటాలతో ప్రచారం సాగిస్తున్నారు. ముందుగా చేసుకున్న ఏర్పాట్ల ప్రకారం పూలు చల్లుట.. హారతులు ఇచ్చుట అనే కార్యక్రమాలు కూడా యథావిధిగా జరుగుతున్నాయి. సొంత సోషల్ మీడియా టీం ద్వారా గ్రూపుల్లోనూ, ఎన్నికల కోసం అద్దెకు తీసుకున్న పత్రికలోనూ ఈ ఫొటోలు, వార్తలతో సందడి చేస్తున్నారు. అయితే సోమవారం రోజు మాత్రం ఈ ప్రచార కార్యక్రమంలో వికటించే సంఘటన చోటు చేసుకుంది. వైసీపీ తిరుపతి అభ్యర్థి భూమన అభినయరెడ్డి, ఆయన తండ్రి భూమన కరుణాకరరెడ్డి, కార్పొరేటర్లు, స్థానిక నాయకులతో కలిసి 12వ డివిజన్‌లోని దాసరిమఠం, టీవీఎస్ షోరూం ప్రాంతాలూ, 17వ డివిజన్‌లోని గోపాలరాజుకాలనీ, గాంధీపురం ప్రాంతాల్లోనూ ఎన్నికల ప్రచారం చేశారు. దాసరిమఠం ప్రాంతంలో 'ఓట్లు మాకే వేయండి' అని అడగగానే అక్కడ టిఫిన్ అంగడి నడుపుకుంటున్న ఒక మహిళ భగ్గుమంటూ లేచింది. "ఇంకా ఏమి మిగిలి వుంది....అన్నీ దోచేశారు...మీకు ఓట్లు అడిగే అర్హత ఎక్కడ వుంది?" అంటూ శాపనార్థాలకు దిగింది. ఆమెను పట్టించుకోకుండా ఇంకొంచెం ముందుకు వెళ్లగానే కొందరు మహిళలు కలిసి కార్యకర్తలను నిలదీశారు. "నాలుగు సంవత్సరాలుగా తాగునీటి కోసం పైపులైను వేయాలని అడుక్కుంటానే ఉండాం. యేనాడూ యెవురూ ఈ దిక్కుకి కూడా రాలేదు. ఎలక్షన్లు వచ్చినాయని మాత్రం ఇప్పుడొచ్చినారా? పొండి..పొండి.." అంటూ అసహనంతో పెద్ద గొంతులతో తిరగబడ్డారు. అక్కడే ఉన్న వైసీపీ నాయకుడు, మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఆడవాళ్లకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మరింతమంది ఆడవాళ్లు నోళ్లు తెరవకముందే బతుకుజీవుడా అనుకుంటూ ప్రచార బృందం అక్కడ నుంచి వెళ్లిపోయింది.

తిరుపతి సీటుపై పునరాలోచించండి

ఇండిపెండెంట్‌గా పోటీచేసే ఆలోచన లేదు - మీడియా సమావేశంలో కన్నీరు పెట్టుకున్న సుగుణమ్మ



విలేకరుల సమావేశంలో కన్నీరు పెట్టుకుంటున్న సుగుణమ్మ

తిరుపతి, మార్చి25(ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఎమ్మెల్యే సీటుపై కూటమి నేతలు పునరాలోచన చేయాలని, తనకు ఇవే చివరి ఎన్నికలని, ఈ వయసులో ఇండిపెండెంట్‌గా పోటీచేసే ఆలోచన లేదని అంటూ టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ కన్నీళ్లు పెట్టుకున్నారు. సోమవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తమ కుటుంబ రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. జై సమైక్యాంధ్ర ఉద్యమ నేపథ్యంలో రాష్ట్రం నుంచి కాంగ్రె‌స్‌ను తరిమికొట్టాలన్న నినాదంతో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆహ్వానం మేరకు 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా వెంకటరమణ పోటీచేసి 45వేల ఓట్ల మెజార్టీతో గెలిచారన్నారు. దురదృష్టవశాత్తు ప్రజా ఉద్యమంలోనే ఆయన కన్నుమూశారన్నారు. ఉప ఎన్నికల్లో తాను లక్ష ఓట్లకు పైగా మెజారిటీతో గెలిచానని వివరించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు కూడా ప్రజల్లోనే ఉన్నానని చెప్పారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రమంతా వైసీపీ హవా సాగుతున్నప్పటికీ తిరుపతిలో మాత్రం 13వ రౌండ్ వరకు కూడా 3వేలు పైచిలుకు ఓట్ల మెజారిటీతో తాను కొనసాగానని గుర్తుచేశారు. చివరిరౌండ్‌లో అధికార పార్టీ తారుమారుకు తాను బలైపోవాల్సి వచ్చిందన్నారు. అప్పటి నుంచి కూడా తిరుపతిలో టీడీపీ కేడర్‌ను కాపాడుకుంటూ, అధిష్ఠానం ఇచ్చిన ప్రతి పిలుపునకూ అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అయితే పొత్తులో భాగంగా జనసేన పార్టీకి తిరుపతి కేటాయించారని, ఇంతకాలం తాము పోరాటం చేసిన వ్యక్తులను మిత్రపక్ష పార్టీలు తిరుపతిలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా నిలిపాయని, వారితో తమ పార్టీ శ్రేణులు ఎలా కలిసి పనిచేయాలో తెలియడం లేదని సుగుణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి అభ్యర్థి విషయంలో జనసేన పార్టీ పునరాలోచన చేయాలని కోరారు.

విద్యుత్ బస్సులకు చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు



తిరుమల, మార్చి25 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో విద్యుత్ బస్సుల చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమల-తిరుపతి మధ్య విద్యుత్ బస్సులను నడుపుతున్నారు. తిరుమలలోనూ భక్తుల కోసం ఉచిత విద్యుత్ బస్సులను అక్టోబరు నుంచి నడుపుతున్నారు. దాదాపు 100 విద్యుత్ బస్సులు తిరుగుతున్నాయి. ఈ బస్సులకు ఛార్జింగ్ కోసం తిరుపతి బస్టాండ్‌కే వెళ్లాల్సి ఉంటోంది. ఈ క్రమంలో చాలా బస్సులకు చార్జింగ్ సమస్య తలెత్తుతోంది. గతేడాది జూలైలో ఓ విద్యుత్ బస్సు ఘాట్ రోడ్డులోని అక్కగార్ల ఆలయం వద్ద నిలిచిపోయింది. ఈ క్రమంలో తిరుమల బాలాజీనగర్‌కు సమీపంలోని రింగురోడ్డు పక్కనే చార్జింగ్ స్టేషన్ నిర్మాణానికి టీటీడీ స్థలం కేటాయించింది. నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

శ్రీవారి సేవలో హయావాహిని దంపతులు



తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ హీరో వెంకటేష్ కుమార్తె హయావాహిని దంపతులు సోమవారం దర్శించుకున్నారు. కొత్తగా పెళ్లయిన హయావాహిని, నిషాంత్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు వారికి ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రంలో బహుజనులకు తీవ్ర అన్యాయం

● బీఎస్పీ కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 25: బీసీ, ఎస్సీ, ఎస్టీలైన బహుజనులకు రాష్ట్రంలో రాజకీయంగా తీవ్ర అన్యాయం జరుగుతోందని బహుజన సమాజ్‌వాది పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కోఆర్డినేటర్, మాజీ డీజీపీ డాక్టర్. జె. పూర్ణచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతితో కలిసి సోమవారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ తరఫున పోటీచేయనున్న 5 లోక్‌సభ, 50 శాసనసభ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభాలో పదిశాతం మాత్రమే ఉన్న రెండే రెండు సామాజిక వర్గాలు రాజ్యాధికారం అనుభవిస్తున్నాయన్నారు.రాయలసీమలోని 250 కులాల్లో 200 కులాలు ఇప్పటివరకు అసెంబ్లీ ముఖం చూడలేదంటే బహుజనులకు ఎంతటి అన్యాయం జరుగుతోందో గ్రహించాలన్నారు.బహుజనుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం వస్తుందంటూ రానున్న ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు

తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 80,532 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 29,438 మంది తలనీలాలు సమర్పించారు.

రమాదేవి ఆస్పత్రిలో ప్లాస్టిక్ సర్జరీ



సర్జరీకి ముందు, తర్వాత యువకుడి మొహం

తిరుపతి(వైద్యం), మార్చి 25 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడికి ప్లాస్టిక్ సర్జరీ చేసి ప్రాణాలు నిలబెట్టామని శ్రీరమాదేవి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరికి చెందిన చిన్న భూపాలన్(24) ద్విచక్ర వాహనంపై వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడని తెలిపారు. మొహంలోని కండరాలు, ఎముకలు పూర్తిగా దెబ్బతినడంతో తమ వైద్యులు ప్లాస్టిక్ సర్జరీ చేసి ప్రాణాలు నిలబెట్టారని వివరించారు. దెబ్బతిన్న సూక్ష్మ రక్తనాళాలు, కండరాలను సరిచేశారని తెలిపారు.

దర్గాగా వరదనీటి కాలువ కబ్జా



కాలువపై నిర్మించిన అక్రమ కట్టడాలు - కాలువపై ఏర్పాటు చేసిన సిమెంటు ప్లేట్లు

మంగళం, మార్చి 24: మంగళం వెంకటేశ్వరకాలనీ వద్ద కొండపై నుంచి వచ్చే వరదనీరు, మురుగునీరు పోవడం కోసం 20 అడుగుల వెడల్పు గల కాలువ ఉంది. దీనిపై స్థానిక వైసీపీ నేతల కన్నుపడింది. వెంటనే రెవెన్యూ అధికారులతో కూర్చుని సెటిల్‌మెంట్ చేశారు. అంతే 20 అడుగుల కాలువ కాస్త 6 అడుగులకు కుచించుకుపోయింది. 14 అడుగుల కాలువ స్థలం ఆక్రమించేశారు. ఆ స్థలంపై షాపులు కట్టేశారు. అలాగే మిగిలిన 6 అడుగులు కూడా ఎందుకు వదలాలి అనుకున్నారో ఏమో దానిపైనా సిమెంటు పలకలు వేసి, అక్రమ నిర్మాణాలకు తెర తీస్తున్నట్లు సమాచారం. పంచాయతీ, రెవెన్యూ అధికారులు దృష్టి సారించి వరదనీటి కాలువను కాపాడాలని వెంకటేశ్వరకాలనీ, సప్తగిరినగర్ వాసులు కోరుతున్నారు.

ప్రాచీన విజ్ఞానంతో ఆధునిక ఆవిష్కరణలు



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సోమయాజులు, కృష్ణమూర్తి

తిరుపతి (రూరల్), మార్చి 25 : ఆధునిక సమాజంలో అభివృద్ధి చెందిన టెక్నాలజీ ద్వారా అనేక మార్పులు, వృద్ధిని తీసుకురావచ్చని కర్నూలుకు చెందిన ఐఐఐటీడీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ డీవీఎల్ఎన్ సోమయాజులు పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ట్రెండ్స్ అండ్ టెక్నాలజీస్ రిలేటెడ్ టు సాంస్క్రీట్ అండ్ కంప్యూటర్స్ అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయసదస్సుకు సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాచీన విజ్ఞానాన్ని వినియోగించి ఆధునిక ఆవిష్కరణలు రూపొందించాల్సిన అవశ్యకతను వివరించారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ, ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ లత, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ బి.చంద్రశేఖరం, అడిషనల్ కన్వీనర్ ప్రొఫెసర్ జి.శ్రీధర్ పాల్గొన్నారు.

రోగులకు విలువలతో కూడిన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న చంద్రశేఖరన్

తిరుపతి(వైద్యం), మార్చి 25 : రోగులకు విలువలతో కూడిన వైద్యాన్ని అందించినప్పుడే త్వరగా కోలుకుంటాడని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని భువన విజయం ఆడిటోరియంలో సోమవారం పీజీ వైద్య విద్యార్థులకు విలువలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖరన్ మాట్లాడుతూ వైద్య రంగంలో రాణించాలంటే విలువలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి వైద్య రంగంలోని విలువలు, నియమ నిబంధనల గురించి వైద్య విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎథికల్ మెంబరు డాక్టర్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ కిరీటి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప బదిలీ

తిరుపతి(నేరవిభాగం) మార్చి 25 : తిరుపతిలో ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేస్తున్న నరసప్ప డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. ఈసీ నిబంధనల మేరకు మూడు సంవత్సరాలకు పైబడి ఒకే డివిజన్‌లో పనిచేస్తుంటే వెంటనే బదిలీ చేయాలి. దీంతో ట్రాఫిక్‌లో పనిచేస్తున్న నరసప్పను డీసీఆర్‌బీకి బదిలీ చేశారు.

డ్రగ్స్ సూత్రధారులు వైసీపీ నేతలే

తెలుగు యువత ఆరోపణ



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 25: విశాఖలో బయటపడిన డ్రగ్స్ దందా సూత్రధారులు వైసీపీ నాయకులేనని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఆరోపించారు. సోమవారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ గంజాయి డాన్, ఎమ్మెల్సీ, వైసీపీ నాయకుడు అనంతబాబును ఎవరు రక్షిస్తున్నారో ప్రజలందరికీ తెలుసన్నారు. గతంలో గంజాయి, డ్రగ్స్ బారినుంచి యువతను కాపాడాలంటూ టీడీపీ తరఫున తాము కార్యక్రమాలు చేస్తే కేసులు పెట్టారని గుర్తుచేశారు. డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం తెలుగుదేశం పోరాటం చేస్తుంటే తమ వ్యాపారం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో వైసీపీ నాయకులు ఆ నెపం తమపై నెడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను, పార్టీకి చెందిన ఇతర నేతలను డ్రగ్స్ వ్యవహారంలో ఇరికించాలని చూస్తున్నారని ఆరోపించారు. నారా లోకేష్ కారును తనిఖీ చేయడం వెనుక కుట్రకోణం ఉందన్నారు. డ్రగ్స్ వద్దు... యువత భవిష్యత్తు ముద్దు అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. తెలుగు యువత నాయకులు కృష్ణయాదవ్, ఆర్సీ శ్రీనివాసులు, తోట వాసు, కరణం సందీప్, రంజిత్‌నాయుడు, శ్రీరామ్ బాబి, లోకేష్‌రాయల్, సంతోష్‌రాయల్, శ్రీరామ్‌బాబి, గోపి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి మృతి



వీరేష్ మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 25 : నగరంలోని కట్టకిందపల్లిలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు.. అనంతపురం జిల్లా విడపనపల్లికి చెందిన వీరేష్ తిరుపతిలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తండ్రి ఆరోగ్యం బాగోలేకపోవడంతో వైద్యం కోసం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. సంపాదించే డబ్బు కుటుంబ పోషణకు సరిపోతుండడం, చేసిన అప్పులు తీర్చలేకపోవడంతో కొన్ని రోజులుగా మనోవేదనకు గురయ్యాడు. మద్యం మత్తులో స్నేహితుడు శంకర్‌కు ఫోన్ చేసి, తాను చనిపోతున్నానని చెప్పాడు. మద్యం మత్తులో ఇలా చెప్పి ఉంటాడని స్నేహితుడు పట్టించుకోలేదు. తెల్లవారుజామున వీరేష్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి సమీపంలోనే అతని అక్క, బావ కాపురమున్నారు. అక్క సునీత ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్ఐ లావణ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత కుటుంబం ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్ట్ చేయాలి



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 25: రాజంపేట నియోజకవర్గం కొత్తమాధవరం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు సుబ్బారావు, భార్య పద్మావతి, కుమార్తె వినయ ఆత్మహత్యకు కారణమైన వారిని తక్షణం అరెస్ట్ చేయాలని టీడీపీ బీసీ సెల్ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాలవారి ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదన్నారు. అందుకు సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య ఓ నిదర్శనమన్నారు. సామాజిక న్యాయమంటూ అధికారానికి వచ్చిన జగన్ దాన్ని ఎక్కడా పాటించలేదన్నారు. వైసీపీ నాయకుల ఘాతుకానికి బలైన చేనేత కార్మిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులు సత్తు మధుసూదన్ యాదవ్, శంకర్, సత్యవతి, తంజావూరు రామయ్య, భక్తవత్సలం, జగన్నాథం, అశోక్ పాల్గొన్నారు.

అన్నదానం



తిరుపతి, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ కోడలు ఎం.స్వాతి ప్రథమ వర్ధంతి సందర్భంగా రుయా ఆస్పత్రి వద్ద సోమవారం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, జేబీ శ్రీనివాస్, కృష్ణ యాదవ్, పుష్పయాదవ్, మహేష్ యాదవ్, చినబాబు, ఊట్ల సురేంద్ర నాయుడు, కరాటే చంద్ర, విశ్వనాథం, రాజారాం, బ్యాంకు శాంతమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ సర్కిల్‌లో కంపుపోయింది

తిరుపతి(నేరవిభాగం), మార్చి 25 : లీలామహల్ రోడ్డులోని వినాయక స్వామి ఆలయం వద్ద పారిశుధ్య లోపం కారణంగా దుర్వాసన వెదజల్లుతుండేది. ఈనెల 23న ఆంధ్రజ్యోతిలో దీనిపై వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ హెల్త్ అధికారులు సోమవారం చేపలమార్కెట్ రోడ్డును శుభ్రం చేయించారు. ఫినాయిల్, బ్లీచింగ్ చల్లారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

తిరుపతి(వైద్యం), మార్చి 25 : క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ అన్నారు. స్విమ్స్‌లోని మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో శ్రీపద్మావతి ఓపీడీ బ్లాక్‌లో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ ఒకరి నుంచి ఒకరికి వచ్చే వ్యాధి అని, ప్రభుత్వాస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. క్రమం తప్పకుండా వాడితే అరికట్టే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ అల్లాడి మోహన్, ప్రిన్సిపాల్ ఉషా కళావత్, డాక్టర్లు నాగరాజు, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నచిన్న లోపాలే పెను ప్రమాదాలకు దారితీస్తాయి

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 25 : చిన్న చిన్న లోపాలను గుర్తించకపోతే పెను ప్రమాదాలకు దారితీసే అవకాశముందని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు అన్నా రు. సోమవారం ప్రజారవాణాధికారి కార్యాలయంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని డ్రైవర్లకు 'ప్రమాద రహిత-ఇంధన పొదుపు' అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డ్రైవర్లు మెళకువలు, నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడం ద్వారా ఇంధన వినియోగం తగ్గి సంస్థకు ఆదాయం సమకూరుతుందన్నారు. ఆర్టీసీ బస్సుల ప్రమాదాలతో కడప జోన్‌లో ఏటా 50నుంచి 60మంది ప్రాణాలు కోల్పోతున్నారని, వాటిని అరికట్టాలని అన్నారు.

పోలీసు పేరుతో మెకానిక్‌లకు బురిడీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 25 : పోలీసు పేరుతో ఒక వ్యక్తి నగరంలోని కొందరు స్కూటర్ మెకానిక్‌ల వద్ద డబ్బు వసూలు చేశాడు. దీనికి సంబంధించి బాధిత మెకానిక్‌లు సోమవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజ్‌కుమార్ అనే వ్యక్తి నగరంలోని పలువురు మెకానిక్‌లకు ఫోన్ చేసి 'నేను కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నా.. మీ షాపు వద్ద నా స్కూటర్ రిపేరు చేయించుకున్నా.. కొంతదూరం వెళ్లాక ఆగిపోయింది.. మళ్లీ ఇంకో మెకానిక్ వద్ద రిపేరు చేయిస్తున్నా..మీపైన కేసు నమోదు చేస్తా..' అంటూ బెదిరించి, రూ.1,500 నుంచి 2వేలు వరకు ఫోన్ పే ద్వారా డబ్బు వేయించుకునేవాడు. ఇలాగే తిరుపతి-మంగళం రోడ్డులోని సీనియర్ మెకానిక్ జలంధర్‌ను బెదిరించి రూ.2వేలు తీసుకున్నాడు. ఇలా ఐదారు మంది నుంచి డబ్బు గుంజుకున్నట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. న్యాయం చేయాలని ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డికి విన్నవించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



కోలాహలంగా రంగుల పండుగ

తిరుపతి (కల్చరల్), మార్చి 25 : నగరంలో సోమవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. యువత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పండుగ జరుపుకున్నారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు, మార్వాడీలు ఉండే కాలనీల్లో యువత రంగులు చల్లుకుని, దాండియా ఆడుతూ సంబరాలు చేసుకున్నారు. పాల్గుణ పౌర్ణమి రోజున హోలీ వేడుకలు జరుపుకోవడం సంప్రదాయం. వసంత మాసంలో వచ్చే ఈ పండుగను చెడుపై మంచి సాధించిన విజయానికి గురుతుగా జరుపుకుంటారు. పలు కళాశాలల వద్ద రంగుల హడావుడి కనిపించింది. తీర్థకట్ట వీధిలో జరిగిన వేడుకల్లో రాయలసీమ రంగస్థలి సభ్యులు యువతతో కలిసి రంగులు జల్లుకుని వేడుక చేసుకున్నారు. ఈ వేడుకల్లో గుండాల గోపినాథ్ రెడ్డి, సురేష్ స్వామి, రఫీ, రమణ, గిరి, సుబ్రహ్మణ్యం, విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమల ఆలయం ముందు సంబరాల్లో చిన్నారులు

బీఎస్ఎఫ్ బలగాలతో ఎస్పీ వేడుకలు

తిరుపతి(నేరవిభాగం): తిరుపతి పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం బీఎస్ఎఫ్ బలగాలతో కలసి హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీ పాటలు పాడుతూ సరదాగా గడిపారు. ఎన్నికల విధుల నిమిత్తం తిరుపతి జిల్లాకు వచ్చిన బీఎస్ఎఫ్ దళాలతో కలిసి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ మురళి, అసిస్టెంట్ కమాండెంట్ సంజీవ్, గౌరి, శంకర్, డీఎస్పీలు, ఏఆర్ సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



బీఎస్ఎఫ్ దళాలతో కలిసి హోలీ వేడుకల్లో ఎస్పీ

శ్రీవారి ఆలయం ముందు..

తిరుమల (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందు స్థానిక చిన్నారులు హోలీ సంబరాలు చేసుకున్నారు. బాలాజీనగర్‌లో నివాసముంటున్న కొందరు పిల్లలు ఆలయం ముందుకు వెళ్లి గోవిందనామస్మరణ చేస్తూ రంగులు చల్లుకున్నారు. శ్రీవారి దర్శనార్థం వచ్చిన పలువురు భక్తులు ఈ దృశ్యాలను ఆసక్తిగా తిలకించారు. కొందరు వారితో కలిసి సంతోషం వ్యక్తం చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చెలరేగుతున్న మట్టి మాఫియా

అనుమతుల పేరుతో అక్రమ తవ్వకాలు ● పరిశ్రమలకు, లేఅవుట్లకు తరలింపు ● చోద్యం చూస్తున్న అధికారులు




మంగళంపాడు చెరువులో మట్టిని తవ్వి టిప్పరుకు లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్ - పెరిమిటిపాడు చెరువులో మట్టి తవ్వడంతో ఏర్పడిన గుంతలు

సూళ్లూరుపేట, మార్చి 23: సూళ్లూరుపేట నియోజకవర్గంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. కోడ్ అమల్లోకి రావడంతో అధికారులంతా ఎన్నికల నిర్వహణపై దృష్టిపెట్టారు. ఇదే అదునుగా కొందరు వైసీపీ నాయకులు ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఎక్కువగా పంటపొలాలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయాయి. ఈ వెంచర్ల పనులకు, పరిశ్రమలకు కేటాయించిన భూముల అభివృద్ధికి మట్టి, గ్రావెల్ అవసరం కావడంతో అక్రమార్కుల కన్ను పడింది. చెరువులు, ప్రభుత్వ భూములు అన్న తేడా లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వి సమీపంలోని సెజ్‌లో ఉన్న పరిశ్రమలకు, వెంచర్లకు తరలించి సొమ్ముచేసుకొంటున్నారు. అనుమతులు లేకుండా రేయింబవళ్లు అక్రమ రవాణా సాగుతున్న పట్టించుకొనే అధికారులే కరువయ్యారు. సూళ్లూరుపేట మండలం మంగళంపాడు చెరువులో నిబంధనలకు విరుద్ధంగా రోజూ పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా శ్రీసిటిలోని కొన్ని పరిశ్రమల భూములకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ చెరువులో మట్టిని తవ్వుకొనేందుకు అడ్డుచెప్పకుండా ఆ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడికి కడపకు చెందిన గ్రావెల్ మాఫియా కొంత నగదు అందజేసినట్లు సమాచారం. అదేవిధంగా సూళ్లూరుపేట నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే రోడ్డు పక్కనే పెరిమిటిపాడు చెరువు మట్టిని అధికార పార్టీ నాయకుడు సమీపంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌కు అక్రమంగా రవాణా చేస్తున్నారు. మూడు రోజుల నుంచి మన్నారుపోలూరు కండ్రిగ చెరువు పక్కనే ఉన్న సర్వే నెంబరు 285, 286లో గిరిజనులకు ఇచ్చిన భూముల్లో ఎక్స్‌కవేటర్ల సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల తరలిస్తున్నారు. ఇక్కడ నుంచి గ్రావెల్, మట్టిని సమీంపలోని పరిశ్రమలకు, వెంచర్లకు తరలిస్తే యూనిట్‌కు రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. అదే 20 కిలోమీటర్ల పరిధిలో సరఫరా చేస్తే రూ.5 వేలకు పైబడి తీసుకుంటున్నారు. ఒక టిప్పరుకు 6నుంచి 12 యూనిట్ల మేర వేసుకొనే సదుపాయం ఉంది. ఈ లెక్కన టిప్పరు గ్రావెల్ మట్టిని రూ.15 వేలు పైబడి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రావెల్ సరఫరా చేసిన అధికార పార్టీకి చెందిన నాయకుడికి ఓ పరిశ్రమ యాజమాన్యం రూ.25లక్షల మేర బిల్లులు సమర్పించినట్లు ప్రచారం జరుగుతోంది. రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకుండా మౌనం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటో అంతుబట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

చిల్లకూరు, మార్చి 25: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ మోటార్లను చోరీ చేసే నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని కొత్తపాళెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రాము, మనోహర్ మద్యానికి బానిసలై, జల్సాలకు అలవాటుపడ్డారు. డబ్బుల కోసం పొలాల్లో వ్యవసాయ మోటార్లు, అల్యూమినియం వైర్లను చోరీ చేసి విక్రయించేవారు. ఈ క్రమంలో మండలంలోని పలు గ్రామాల్లో రూ.2,10,000 విలువ చేసే 14 విద్యుత్ మోటార్లు, రూ.9,600 విలువ చేసే కిలో అల్యూమినియం వైరును చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ అంజిరెడ్డి, నావూరయ్య, కస్తూరయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, విష్ణుకుమార్, భాస్కర్, నరేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి, విష్ణుకుమార్, భాస్కర్, రాజా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి

గూడూరు, మార్చి 25: రానున్న ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి జరుగుతుందని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయానికి వచ్చిన ఆయనకు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నాయకులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వరప్రసాదరావు మాట్లాడుతూ 12 ఏళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో ఎంతో క్రమశిక్షణగా వ్యవహరించానని, ప్రత్యేకహోదా కోసం తన ఎంపీ పదవి కూడా రాజీనామ చేయడం జరిగిందన్నారు. కష్టకాలంలో పార్టీ కోసి పనిచేసిన తనకు సముచిత గౌరవం ఇవ్వకపోవడంతో పార్టీని వీడానన్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన తాను చివరి వరకు ప్రజల్లోనే ఉండాలనే ధ్యేయంతో బీజేపీలో చేరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సిలికా అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని వరప్రసాదరావు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, ఆరికట్ల బాలకృష్ణం నాయుడు, చంద్రప్ప, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, రవీంద్రరెడ్డి, చాన్‌బాషా, దశరథరామిరెడ్డి, భైరప్ప, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

భాకరాపేట, మార్చి 25: నాలుగేళ్ళ చిన్నారిపై అత్యాచార యత్నం చేసిన ఘటన చిన్నగొట్టిగల్లుమండలంలో జరిగింది. భాకరాపేట పోలీసుల కథనం మేరకు తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఓ కూలీ నాలుగేళ్ల కుమార్తె ను తమిళనాడుకు చెందిన వేలు ఓ గుడిసెలోకి తీసుకెళ్ళి అత్యాచారానికి ప్రయత్నించాడు. చిన్నారి ఏడ్పులు విన్న ఆమె తల్లి గుడిసెలోకి వెళ్ళి చూడ్డంతో వేలు పారిపోయాడు. బాలిక తల్లితండ్రుల ఫిర్యాదు మేరు ఎస్ఐ విజయ్‌కుమార్‌నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



శ్రీహరిపురంలో భాను సమక్షంలో చేరిన వైసీపీ కార్యకర్తలు

విజయపురం, మార్చి 25: శ్రీహరిపురంలో వైసీపీ ప్రధాన కార్యదర్శి ఆషాది ప్రకాష్ యాదవ్, అతని అనుచరులు కుప్పయ్య, బాలకృష్ణా, అయ్యప్ప, కాటయ్య, వెంకటేసులు, నాని, సుధాకర్, యశ్వంత్, మునికృష్ణా, రోహిత్, నవీన్, ప్రశాంత్, రమేష్, చిరంజీవి తదితరులు నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీలో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు లేదని, గ్రామాభివృద్ధి క్షీణించిందని తాము పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ పని చేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం కోసలనగరంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బుధవారం పుత్తూరులో జరిగే చంద్రబాబు పర్యటనవిజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఇటీవల మృతి చెందిన కోడూరు మణి కుటుంబాన్ని పరామర్శించారు. చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి చినబాబు, రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు చిన్నబ్బరాజు పాల్గొన్నారు.

నిండ్ర: పుత్తూరులో బుధవారం జరిగే టీడీపీ రోడ్ షో, బహిరంగ సభను విజయవం చేయాలని నగరి నియోజకవర్గం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి గాలి భాను ప్రకాష్ కోరారు. సోమవారం నిండ్రలో టీడీపీ నాయుకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో నగరిలో చంద్రబాబు బహిరంగ సభ, పుత్తూరులో లోకేష్ యువగళం కార్యక్రమాలకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేశారని అన్నారు. ఇదే ఉత్సాహం కొనసాగించాలన్నారు. పుత్తూరు సభ కూడా విజయవంతం చేయాలన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు రవికుమార్, మనోహర్‌నాయుడు, ఓంప్రకాష్, గాలి రమేష్‌నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

నగరి: నగరి పట్టణం, మండల పరిధిలోని వైసీపీ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. నగరిలో నాలుగో వార్డుకు చెందిన డాక్టర్ గుణశేఖర్ అతని అనుచరులు, గుండ్రాజుకుప్పంలో వడ్డెర్లకు చెందిన కొందరు గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పొందారు.

నేలబావిలో పడి ఇంటర్ విద్యార్థి మృతి

నాయుడుపేట టౌన్, మార్చి 25: నేలబావిలో పడి ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన నాయుడుపేట మండలంలోని కోనేటిరాజుపాళెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... హైదరాబాదులోని అమీర్‌పేటకు చెందిన ఈశ్వర్ కుమారుడు మోజస్(17) ఇటీవల ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాశాడు. సెలవులు కావడంతో వారం రోజుల క్రితం కోనేటిరాజుపాళెంలోని చిన్నాన్న ఇంటికి వచ్చాడు. సోమవారం స్నేహితులతో కలిసి బహిర్భూమి కోసం గ్రామ సమీపంలో ఉన్న నేలబావి వద్దకు వెళ్లాడు. మోజస్ నేలబావిలో దిగాడు. ఇంతలో బావిలో నుంచి శబ్ధం రావడంతో సమీపంలో ఉన్న స్నేహితులు వచ్చి చూసేసరికి మోజస్ నీట మునిగిపోతుండడం గమనించారు. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు వచ్చేసరికి మోజస్ మృతి చెందాడు. మృతదేహాన్ని బయటకుతీసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మోజస్ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

వెంకటగిరిని నంబరు వన్‌గా అభివృద్ధి చేస్తా : లక్ష్మీసాయిప్రియ



ప్రజలతో కరచాలనం చేస్తున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి/డక్కిలి, మార్చి 25: వెంకటగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్‌వన్‌గా అభివృద్ధి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ చెప్పారు. సోమవారం ఆమె తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి పట్టణంలోని 1వ వార్డు బంగారుపేట నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తే ఐదేళ్లు కష్టపడి పనిచేస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అరాచక, విధ్వంసం పాలనకు ఇంకో యాభైరోజుల్లో ప్రజలు స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. లేదంటే ఆంధ్రప్రదేశ్‌లో సామాన్యులు బతకలేని పరిస్థితులు వస్తాయన్నారు. అంతకుముందు వార్డులోకి ప్రచారంకోసం విచ్చేసిన లక్ష్మీసాయిప్రియను టీడీపీ అభిమానులు పూలతో ముంచెత్తారు. అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల నివాసంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. త్వరలో జరిగే ఎన్నికలను యుద్ధంలా భావించి ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జన్ని రమణయ్య, చక్రాల ఉష, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాధనాయుడు, గంగాధర్, కాపా శ్రీనివాసులు నాయుడు, సత్యం, దందవోలు వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనను గద్దెదించాలి: టీడీపీ

గూడూరు, మార్చి 25: రాష్ట్రంలో రాక్షస పాలనను గద్దెదించాల్సిన సమయం ఆసన్నమైందని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం చిల్లకూరు మండలం తిక్కవరం, నాంచారమ్మపేట, ముత్యాలపాడు, తొణుకుమాల తదితర గ్రామాల నుంచి పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, కిషోర్‌నాయుడు, సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, గుండాల లీలావతి, పజ్జూయి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసులు

బాలాయపల్లి, మార్చి 25: మహిళపై దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహబూబ్ సుభాని తెలిపారు. మండలంలోని పిగిలాం గ్రామానికి చెందిన ఈతముక్కల రత్నమ్మపై అదే గ్రామానికి చెందిన జొన్నలగడ్డ పెంచలరామయ్య, నాగరాజు, రజిత, పూజ కత్తి, రాళ్లతో దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే అక్కసముద్రం గ్రామానికి చెందిన అశోక్, ప్రసాద్, మంజుల అదే గ్రామానికి చెందిన దాడి చేశారని బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులపై దాడి చేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల ఉల్లంఘనకు ముకుతాడు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్

● అక్రమాలకు చెక్ సి-విజిల్ యాప్

● ఫిర్యాదుల కోసం (0877-2236007) కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్



...లను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతోంది. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిని కనిపెట్టి అక్రమాలకు చెక్ పెట్టేందుకు పలు రకాల యాప్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి సి-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎన్నికల ప్రలోభాలు, అక్రమాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో కోడ్ ఉల్లంఘన, ఓటర్లకు కావాల్సిన సమాచారం తెలుసుకోవడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది.

వంద నిమిషాల్లో చర్యలు..

గూగుల్ ప్లేస్టోర్ నుంచి సి-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నంబర్ రిజిస్టర్ చేసుకోవాలి. ఫోన్‌కు వచ్చిన ఓటీపీని రిజిస్టర్ చేసుకోవాలి. కోడ్ ఉల్లంఘనకు సంబంధించి ప్రత్యేకంగా తీసిన వీడియోలు, ఫొటోలు, ఆడియో అప్‌లోడ్ చేయవచ్చు. ఫిర్యాదు రిజిస్టర్ అయితే యూనిక్ ఐడీ నంబరు వస్తుంది. తద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో జిల్లా యంత్రాంగం పరిష్కరిస్తుంది. ఫిర్యాదుల పర్యవేక్షణకు జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాదరావును నోడల్ అధికారిగా నియమించారు. ఇప్పటివరకు 182 ఫిర్యాదులు సి-విజిల్ యాప్‌కు అందాయి. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడం ఈ యాప్ ప్రత్యేకత.

ఎన్‌జీఎస్‌పీ : ఎన్నికల ఫిర్యాదులు, ప్రశ్నలను దాఖలు చేయడానికి నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్(ఎన్‌జీఎస్‌పీ) యాప్ దోహదపడుతుంది.

సువిధ : అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రదర్శనలు, సమావేశాలు, ఇతర ప్రచార సంబంధిత కార్యకలాపాలకు అనుమతులను అభ్యర్థించడానికి ఇది ఉపయోపడుతుంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం : ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టర్ లక్ష్మీశ నేతృత్వంలో ప్రత్యేక విభాగం ఏర్పాటైంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. దీనికి నోడల్ అధికారిగా జిల్లా ఉద్యానవనశాఖ అధికారి దశరథరామిరెడ్డిని నియమించారు. ఎవరైనా సరే 0877-2236007 కు ఫోన్‌చేసి తగిన వివరాలు తెలుసుకోవడంతోపాటు ఫిర్యాదులు చేయవచ్చు. ఓటర్లు 1950 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి తగిన సమాచారం పొందవచ్చు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి, చర్యలు తీసుకునేందుకు కలెక్టరేట్‌లో ఓ బృందాన్ని నియమించారు.

దివ్యాంగుల చేయూతకు సాక్ష్యం : వయోవృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రానికి రాలేని వారు ఇందులో తమపేర్లను నమోదు చేసుకోవచ్చు. వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు అధికారులు రవాణా సదుపాయాన్ని కల్పిస్తారు. ప్రత్యేకంగా సహాయకులను అందుబాటులో ఉంచుతారు. దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీని సమకూరుస్తారు. 85ఏళ్లుదాటినవారు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ యాప్ నిర్వహణకు నోడల్ అధికారిగా మెప్మా పీడీ రాధమ్మను నియమించారు.

బీజేపీ నాయకురాలుతో 'గాలి' భేటీ

పుత్తూరు అర్బన్, మార్చి 25: బీజేపీ మహిళామోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు, ఆమె భర్త సురేంద్రరాజుతో గాలి భానుప్రకాష్ సోమవారం భేటీ అయ్యారు. సురేంద్రనగరంలోని నిషిధరాజు స్వగృహంలో వారిద్దరినీ కలిసి గాలి భానుప్రకాష్ మద్దతు కోరారు. ఈ సందర్భంగా నిషిధరాజు మాట్లాడుతూ గాలి భానుప్రకాష్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. అలాగే సురేంద్రరాజు సైతం తనకున్న విస్తృత పరిచయాలతో భానుప్రకాష్ గెలుపుకు సహకరిస్తానని వెల్లడించారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న యువకులు



పుత్తూరు అర్బన్, మార్చి 25: మండల పరిధిలోని పరమేశ్వరమంగళం పంచాయతీ కనంమిట్టకు చెందిన సుమారు 20 మంది యువకులు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రూరల్ క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య ఆధ్వర్యంలో యువకులు గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. భానుప్రకాష్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధితోపాటు నిరుద్యోగ సమస్యల పరిష్కారం టీడీపీతోనే సాధ్యమన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నగరి, మార్చి 25: నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడ నుంచి ఏకాంబరకుప్పానికి వెళ్లే మార్గంలో చెరువుకట్టపై గల కనికలమ్మ ఆలయంలో చెట్టుకు ఉరివేసుకుని భాస్కర్(45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. వ్యక్తిగత తగాదాల కారణంగా ఏకాంబరకుప్పానికి చెందిన భాస్కర్ ఉరివేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈమేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు సీఐ సురేష్ తెలిపారు.

పుత్తూరు వార్తలు

నారాయణవనంలో పోలీసు కవాతు

నారాయణవనం,మార్చి25: మండల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాలలో కేంద్ర సాయుధ బలగాలు (బీఎస్ఎఫ్)తో పోలీసులు కవాతు నిర్వహించారు. సోమవారం తిరువట్టం ఎస్టీకాలనీ, ఎరికంబట్టు, కసింమిట్ట, ఇప్పతాంగల్ గ్రామాల పరిధిలో పోలీసులు కవాతు నిర్వహించారు. పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా, ప్రజల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టి, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చేయడమే ధ్యేయమని తెలిపారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలంగా హోలీ వేడుకలు



రంగులు చల్లుకుని హోలీ చేసుకుంటున్న మార్వాడీలు

పుత్తూరు టౌన్, మార్చి 25: హోలీ పండుగను సోమవారం పట్టణంలోని యువకులు, మహిళలు, పిల్లలు కలిసి కోలాహలంగా నిర్వహించుకున్నారు. రంగులు చల్లుకుని, రంగు నీళ్లు ఒకరిపై ఒకరు పోసుకుంటూ ఆనందాన్ని వ్యక్తంచేశారు. తర్వాత ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

మూర్తి గురుకుల్ భౌతికకాయానికి నివాళి

పుత్తూరు అర్బన్, మార్చి 25: పట్టణానికి చెందిన ప్రముఖ అర్చకులు మూర్తి గురుకుల్ భౌతికకాయానికి గాలి భానుప్రకాష్ సోమవారం కాపువీధిలో నివాళులర్పించారు. ఆదివారం జరిగిన ఒక ప్రమాదంలో మూర్తి గురుకుల్ మృతి చెందిన విషయం తెలిసిందే.

రేపు పుత్తూరులో చంద్రబాబు బహిరంగ సభ



చిన్నరాజుకుప్పం వద్ద హెలీపాడ్‌ను పరిశీలిస్తున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 25: టీడీపీ అధినేత చంద్రబాబు పుత్తూరు పర్యటన ఖరారైంది. ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో ఉన్న కాపువీధి కూడలి వద్ద బహిరంగ సభలో పాల్గొననున్నారు. పలమనేరు నుంచి హెలికాప్టర్ ద్వారా చిన్నరాజుకుప్పం వద్ద ఏర్పాటు చేసిన హెలీపాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి కారులో కాపువీధి కూడలికి చేరుకుని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం మళ్లీ హెలీపాడ్‌కు చేరుకుని మదనపల్లికి బయలు దేరనున్నారు. నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సోమవారం చిన్నరాజుకుప్పం వద్ద ఏర్పాటు చేస్తున్న హెలీపాడ్‌ను పరిశీలించారు. అలాగే పుత్తూరు, విజయపురం, నగరిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసేందుకు దిశానిర్ధేశం చేశారు.

ప్రజాగళం సభను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 25: టీడీపీ అధినేత చంద్రబాబుని పాల్గొననున్న ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేద్దామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డు నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చే విధంగా పార్టీ నాయకులు ఏర్పాట్లు చేయాలని దిశానిర్ధేశం చేశారు.

వడమాలపేట : పుత్తూరులో బుధవారం జరిగే ప్రజాగళం సభను విజయవంతం చేయాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు దేవానందనాయుడు కోరారు. సోమవారం వడమాలపేట పార్టీ కార్యాలయంలో జన సమీకరణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గాలి భానుప్రకాష్ నాయకత్వాన్ని బలపరుస్తూ చంద్రబాబుకు సభకు భారీగా జనం వచ్చేలా నాయకులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జానా వెంకటయ్య, మణిరాజు, ధనంజయులు, సుబ్రమణ్యం యాద్, హేమావతి, పెద్దబ్బరాజు, లక్ష్మీప్రసన్న, దాముయాదవ్, డిల్లీప్రసాద్, రమేష్, రాధాకృష్ణ, శేషాద్రి, బాలకృష్ణ ఉమాపతిరావ్, ఉదయ్‌శెట్టి, భాస్కర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు చెప్పి వైసీపీ కండువాలు కప్పారు



ముస్లిం నాయకులకు తిరిగి టీడీపీ కండువాలు కప్పుతున్న చినబాబు

పుత్తూరు అర్బన్, మార్చి 25: గేటు పుత్తూరులోని మసీదు అభివృద్ధికి నిధుల విషయం చర్చించేందుకు పిలిచి మంత్రి రోజా చేతుల మీదుగా వైసీపీ కండువాలు కప్పించారని టీడీపీ మైనార్టీ నాయకులు నసూరుల్లా, మస్తాన్, షరీఫ్, బదురుద్దీన్ తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు సమక్షంలో తిరిగి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారు మాట్లాడుతూ ఆదివారం తమకు అబద్ధాలు చెప్పి నగరిలోని మంత్రి రోజా గృహంలో బలవంతంగా వైసీపీ కండువాలు కప్పించారని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బీఆర్ యుగంధర్, ముస్లిం మైనార్టీ నాయకులు మహ్మద్ నబీ, ఖాజాపీర్, మహ్మద్ రఫీ, మహ్మద్ గౌస్, షబ్బర్, జాబీర్, శంషు, హమీద్, సిద్ధిక్, నాయకులు భాస్కర్‌నాయుడు, కరుణ, శేఖర్, కిరణ్ ఆచ్చారి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

టీడీపీలోకి మాజీ వలంటీరు, ఉప సర్పంచ్



సీతారాంపేటలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, మార్చి 25: ఏర్పేడు మండలం సీతారాంపేటకు చెందిన 50 మంది టీడీపీలో చేరారు. ఊరందూరులోని బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీతారాంపేట పంచాయతీలో గ్రామ వాలంటీరు సురేష్ వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో చేరిన వారిలో మాజీ వలంటీరు సురేష్, ఉప సర్పంచ్ గురుశంకర్, మెండు గురవయ్య, ప్రవీణ్, అఖిల్, నరసింహులు, కుమార్, సూరి, జనసేన గ్రామ యువత నాయకుడు సురేష్ తదితరులు ఉన్నారు.

టీడీపీని గెలిపించండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రేణిగుంట, మార్చి 25: వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. సోమవారం మామండూరు, కరకంబాడి పంచాయతీ పరిధిలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చంద్రారెడ్డి, ఇన్‌చార్జి బుజ్జినాయుడు, నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, స్వాతి, రమేష్, శేషాద్రి, క్రాంతి, మునిభూషణ్, చలం, ఉదయ్, మునెయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి టీడీపీతోనే



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎస్సీసెల్ నాయకులు

తొట్టంబేడు, మార్చి 25: దళితుల అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించుకోవాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు చుక్కల రమేష్ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని యార్లపూడి, గోవిందరావుపల్లి, గుండ్లపల్లి, సూరావారిపల్లి, వాగివేడు గ్రామాలలోని ఎస్సీ కాలనీలలో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో బొజ్జల సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, నాయకులు గురుస్వామి, శశికుమార్, వేణుగోపాల్, దినేష్, మునికుమార్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి : డీఎస్పీ



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ భవ్య కిషోర్

ఏర్పేడు, మార్చి 25: ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ సూచించారు. సోమవారం ఏర్పేడు మండలం కందాడు గ్రామంలో ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీరామ శ్రీనివాసులు, ఎస్‌ఐ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు

తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 80,532 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 29,438 మంది తలనీలాలు సమర్పించారు.

పట్టాలు సరే.. స్థలాలు ఏవీ..?



పూరిగుడిసెల్లోనే నెలటూరు గిరిజన కాలనీ

వరదయ్యపాళెం, మార్చి 25: వరదయ్యపాళెం మండలంలోని నెలటూరు గిరిజనులకు ఇంటిపట్టాలు ఇచ్చి నాలుగు సంవత్సరాలు అయినా ఇంత వరకు పక్కా ఇళ్లు మంజూరు చేయలేదు. దీంతో వారికి సరైన నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారలేదని వారు వాపోతున్నారు. గుడలవారిపాళెం ఎస్టీకాలనీ నుంచి సుమారు 10 కుటుంబావారం చాలా సంవత్సరాల క్రితం నెలటూరు పంచాయతీలోని గిరిజనకాలనీకి వచ్చారు. పూరిగుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. వర్షం వస్తే గుడిసెల్లోకి నీరు చేరి కనీసం నిల్చుకోవడానికి కూడా వీలు లేని పరిస్థితి. ఇక రాత్రి సమయాల్లో పాముల బెడదతో ఎప్పుడు ఎవరికి ఏమీ జరుగుతుందో తెలియదు. ఎన్నికల సమయంలో వచ్చిన నాయకులు అది చేస్తాం, ఇది చేస్తాం అని చెబుతున్నారే తప్ప గెలిచాక తమను పట్టించు కోవడం లేదని విచారం వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికీ అక్కడ విద్యుత్ వసతి లేదు. చాలా మంది అర్హులున్నా రేషన్ కార్డులు సైతం ఇవ్వలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు పక్కాఇళ్లు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.





ఇంటి పట్టాలను చూపుతున్న ఎన్వీరమణ, ఇల్లు లేని గిరిజనులు

గోదాములో వైసీపీ కానుకల నిల్వ..?

రేణిగుంట, మార్చి 25: రేణిగుంట మండల పరిధిలో ఓటర్లకు పంపిణీ చేసే కానుకలు భారీ మొత్తంలో ఓ గోదాములో నిల్వ ఉంచారని ప్రచారం జరుగుతోంది. గొడుగులు, వాచ్‌లు, బ్యాగులు, చీరలు భారీ మొత్తంలో నిల్వ ఉంచారని సమాచారం. దీనికి తోడు మద్యం కూడా భారీ మొత్తంలో నిల్వ ఉంచారని ప్రచారం జరుగుతోంది.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేవీబీపురం, మార్చి25: కేవీబీపురంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి తెలియజేశారు. ఈ నెల 28 నుంచి మే 22వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలి. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. ఓసీ, బీసీలు 200/-, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 150/- చొప్పున చెల్లించి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. పదోవ తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఉంటాయి.

విభూదీశ్వరుడిగా మృత్యుంజయ స్వామి



శ్రీకాళహస్తి, మార్చి 25: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన మృత్యుంజయస్వామి విభూదీశ్వ రుడుగా భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం పురస్కరించుకొని మృత్యుంజయ సన్నిధిని అర్చకులు శుద్ధి చేశారు. అనంతరం భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. వేదమం త్రాలతో ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి ఆలయానికి ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న ఉష

శ్రీకాళహస్తి, మార్చి 25: ముక్కంటి ఆలయానికి తిరుపతికి చెందిన రాయలసీమ ఏజెన్సీ నిర్వాహకురాలు ఉష 100 ఫ్యాన్లు వితరణ చేశారు. ఈ మేరకు ఆలయంలోని పరిపాలన భవనంలో సోమవారం చైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత ఉష మాట్లాడుతూ క్యూలైన్లో భక్తులకు ఉక్కపోత నుంచి ఉపశమనం కల్పించాలన్న ఉద్దేశంతో ఫ్యాన్లు అందించినట్లు తెలిపారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి అండగా ఉంటా: ఆదిమూలం



అంబాకం మాజీ సర్పంచ్‌ని కలసిన ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, మార్చి 25: సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం ఆ పార్టీ నేతల మద్దతు కోరుతూ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అసంతృప్తులను కలుస్తూ ముందుకు వెళ్లేలా వ్యూహ రచన చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సత్యవేడు మండలంలోని పుదుకుప్పానికి చెందిన మాజీ ఎంపీటీసీ వినాయక, సర్పంచ్ దేవేంద్ర, సీతారాంపేట గ్రామానికి చెందిన శివయ్యనాయుడు పాండురంగం, అంబాకానికి చెందిన రాజా, సుబ్రహ్మణ్యం, బాల, సత్యవేడు కేంద్రంలోని రాము, శివానందం, అగ్రహారానికి చెందిన గణేష్, బాలాజీ, చెంగల్రాయరెడ్డి, యుగంధర్ తదితరులను కలిశారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరచి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సత్యవేడు మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి పరమ శివం, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, యువ నాయకులు శశిమోహన్ నాయుడు, గుర్రప్ప పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

తొట్టంబేడు, మార్చి 25: శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కందాటి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో 30 కుటుంబాల్లోని యువత టీడీపీలో చేరారు. ఊరందూరులోని బొజ్జల సుధీర్‌రెడ్డి ఇంటివద్ద సోమవారం ఈ చేరికలు జరిగాయి. బొజ్జల బృందమ్మ, రిషితారెడ్డి వారికి పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తులసిరామిరెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

చిత్రం...భళారే విచిత్రం

- జగనన్న కాలనీ రోడ్డు స్వాహా
- పట్టించుకోని అధికారులు
- దిక్కుతోచని స్థానికులు



రోడ్డుపై ఫెన్సింగ్ రాళ్లు నాటిన కబ్జాదారులు

శ్రీకాళహస్తి, మార్చి 25: శ్రీకాళహస్తిలో కబ్జాలకు కాదేది అనర్హం అన్నట్లుగా అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఏకంగా జగనన్న కాలనీ ప్రధాన రోడ్డుకు అడ్డంగా తంతి రాళ్లను నాటేశారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులో సుమారు 20 ఏళ్ల క్రితం రాజీవ్ నగర్ కాలనీ ఏర్పడింది. పట్టణ శివారులో పిచ్చాటూరు రహదారికి ఆనుకుని కాలనీ ఏర్పాటు చేశారు. తూర్పు వైపున రాజీవ్ నగర్ కాలనీకి పిచ్చాటూరు రహదారి నుంచి లింక్ రోడ్డు వేశారు. రహదారికి తూర్పు వైపున పాత రాజీవ్ నగర్ కాలనీ రోడ్డుకు ఆనుకొని జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. దాంతో ఈ రోడ్డు రెండు కాలనీలకు మధ్య ప్రధాన రహదారి నుంచి లింక్ రోడ్డుగా నిలిచింది. అటు జగనన్న కాలనీకి... ఇటు మరో వైపున రాజీవ్‌నగర్ కాలనీలోని ఒక వీధికి ఈ రోడ్డు చాలా కీలకం. గత ఏడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలతో రాజీవ్‌నగర్ కాలనీలో పనస కాలువ ఉధృతంగా ప్రవహించింది. పనస కాలువ పొంగి పొర్లడంతో జగనన్న కాలనీ రోడ్డుపైకి వెల్లువలా నీరు ప్రవహించింది. దాంతో ఈ రోడ్డు పాడవడంతో బాగు చేయాలని స్థానికులు కోరుతున్నా అధికారులు కనీసం స్పందించిన పాపాన పోలేదు. అయితే ఇటీవల రోడ్డుపై కంచె ఏర్పాటు చేసే రాళ్లు దర్శనమిచ్చాయి. ఈ రోడ్డు కబ్జాను ఆపకపోతే వందలాది నివాస గృహాలకు భవిష్యత్తులో దారి సమస్య ఎదుర్కోక తప్పదు. పిచ్చాటూరు రహదారికి ఆనుకుని జగనన్న కాలనీ లేఔట్‌లో వందలాది ప్లాట్లున్నాయి. సగం రోడ్డు ఆక్రమించి కంచె వేసేందుకు అక్రమార్కులు సన్నాహాలు చేస్తున్నారు.

స్కిట్లో స్ట్రాంగ్ రూములు



స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్

శ్రీకాళహస్తి, మార్చి 25: స్కిట్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల భవనాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రెండు స్ట్రాంగ్ రూములు స్కిట్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకోసం అవసరమైన సౌకర్యాలు, భద్రత అంశాలపై కసరత్తు చేసి ఎన్నికల అధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. స్కిట్ కళాశాల నుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని 293 బూత్‌లకు ఈవీఎం యంత్రాలను తరలించినట్లు వెల్లడించారు. పోలింగ్ ముగిసిన తర్వాత తిరిగి స్ట్రాంగ్ రూములకు చేర్చి, ఇక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ సెంటరుకు పంపనట్లు తెలిపారు. ఈవీఎంలు శ్రీకాళహస్తికి చేరుకొనే లోగా స్ట్రాంగ్ రూముల వద్ద మరింత కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



రాయలవారి మండపం వద్ద బారులు తీరిన భక్తులు

శ్రీకాళహస్తి, మార్చి 25: ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు, సోమవారం హోలీ పండుగ కలిసి రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ఆదివారం రాత్రి నుంచే శ్రీకాళహస్తిలో భక్తులతో వసతి గృహాలన్నీ నిండిపోయాయి. పరమశివునికి ప్రీతికరమైన సోమవారం వేకువ జాము నుంచే భక్తులు దర్శనం కోసం క్యూ లైన్లో బారులు తీరారు. ఉదయం రాహుకాలం సమయంలో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు జరిపించుకునేందుకు భక్తులు విశేషంగా ఆసక్తిచూపారు. ఆ సమయంలో అధికంగా రద్దీ కనిపించింది. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 32వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు.

గిరిజనులను దగా చేసిన వైసీపీ

శ్రీకాళహస్తి, మార్చి 25: గిరిజనులను దగా చేసిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బొజ్జల రిషితారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి 'గిరిజన ఘోష వినపడలేదా' అన్న నినాదంతో సోమవారం ప్రచార యాత్ర ప్రారంభించారు. గిరిజన అభ్యున్నతి కోసం టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అలాగే వైసీపీ రద్దు చేసిన 16 అంశాలతో కరపత్రం ఆవిష్కరించారు. తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: అభివృద్ధి సంక్షేమం టీడీపీకి రెండు కళ్లలాంటివని వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీని గెలిపించాలని బొజ్జల రిషితారెడ్డి కోరారు. మండలంలోని గురప్పనాయుడుకండ్రిగ, కొణతనేరి గ్రామాలలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, జడ్పీటీసీ తిరుమలయ్య, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, మండల అధ్యక్షుడు మురళినాయుడు, మునిరాజ నాయు డు, కన్నలి ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, జయచంద్ర నాయుడు, లెక్కల మురళినాయుడు, సర్పంచ్ బాలాజీ నాయుడు, చంచయ్యనాయుడు, జనసేన నాయకులు కొట్టేసాయి, మహేష్, బాలాజీరెడ్డి, శంకర్ యుడు, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

రూ.10 కోట్ల బంజరు భూమి కబ్జా



కొట్రమంగళం సమీపంలో వాగుబంజరుకు వేసిన కంచె

తిరుపతి(ఆటోనగర్), మార్చి 25: రేణిగుంట మండలంలో వైసీపీ నాయకుల భూకబ్జాలకు అంతేలేదు. రెండురోజుల క్రితం సుమారు రూ 10 కోట్ల విలువగల 10.96 ఎకరాలు కాలువ బంజరు భూమిని కబ్జా చేసి కంచె వేశారు. కొట్రమంగళం గ్రామరెవిన్యూ లెక్క దాఖలాలోని సర్వేనెంబర్ 194లో కాలువ బంజరు భూమి 10.96 ఎకరాలు ఉంది. ఈ భూమిని వైసీపీ నాయకులు రెండురోజుల క్రితం ఆక్రమించి కంచె వేశారు. ఈ విషయంపై గ్రామ రెవిన్యూ అధికారికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని కొట్రమంగళం గ్రామ రైతులు తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడే భూమి కబ్జాను అడ్డుకోవాలని రైతు రొమ్మాల దేవేంద్రనాథ్‌రెడ్డి తదితరులు కోరారు.

దర్గాగా వరదనీటి కాలువ కబ్జా



కాలువపై నిర్మించిన కట్టడాలు

మంగళం, మార్చి 24: మంగళం వెంకటేశ్వర కాలనీ వద్ద కొండపై నుంచి వచ్చే వరదనీరు, మురుగునీరు పోవడం కోసం 20 అడుగుల వెడల్పు గల కాలువ ఉంది. దీనిపై స్థానిక వైసీపీ నేతల కన్ను పడింది. వెంటనే రెవెన్యూ అధికారులతో కూర్చుని సెటిల్‌మెంట్ చేశారు. అంతే 20 అడుగుల కాలువ కాస్త 6 అడుగులకు కుచించుకుపోయింది. 14 అడుగుల కాలువ స్థలం ఆక్రమించేశారు. ఆ స్థలంపై షాపులు కట్టేశారు. అలాగే మిగిలిన 6 అడుగులు కూడా ఎందుకు వదలాలి అనుకున్నారో ఏమో దానిపైనా సిమెంటు పలకలు వేసి, అక్రమ నిర్మాణాలకు తెర తీస్తున్నట్లు సమాచారం. పంచాయతీ, రెవెన్యూ అధికారులు దృష్టి సారించి వరదనీటి కాలువను కాపాడాలని వెంకటేశ్వరకాలనీ, సప్తగిరినగర్ వాసులు కోరుతున్నారు.

మోదీ పనితీరుకు ఆకర్షితుడై బీజేపీలో చేరా



వరదయ్యపాళెం, మార్చి 25: వరదయ్యపాళెం మండలంలోని విజ్ఞాన నగర్‌లో సోమవారం తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ పర్యటించారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన చిట్టిబోయిన జానకి రామయ్య ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి వరప్రసాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పనితీరుకు ఆకర్షితుడై బీజేపీలో చేరానన్నారు. ప్రస్తుత నియోజకవర్గ పరిస్థితిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి కారులో మద్యం సీజ్!





పట్టుబడ్డ మద్యం బాటిళ్లు, వైసీపీ నాయకుడి కారు

నాగలాపురం, మార్చి 25: నాగలాపురం మండలంలో కారులో అక్రమంగా తరలిస్తున్న 60 కేసుల కర్నాటక మద్యాన్ని ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వజ్జావారి కండ్రిగ సమీపంలో ఆదివారం రాత్రి కారును సినీ ఫక్కీలో వెంబడించి పట్టుకున్నారు. కారుతో పాటూ ఇద్దరినీ, కారులో ఉన్న 60 కేసుల మద్యాన్ని ఎస్‌ఈబీ సీఐ గోపీకృష్ణ, ఎస్‌ఐ శశిధర్ స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడ్డ వారిలో వార్డు మెంబరైన వైసీపీ నేత కుమారుడున్నట్లు సమాచారం. దీంతో వైసీపీ నాయకులు రంగ ప్రవేశం చేసి కేసు నమోదు కాకుండా అడ్డుపడుతుండడంతో సోమవారం సాయంత్రం వరకూ కేసు నమోదు చేయలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైసీపీ నేతల కన్నుసన్నల్లోనే మద్యం అక్రమ రవాణా

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 25: నాగలాపురం మండలంలో పట్టుబడ్డ మద్యం రవా ణా చేస్తున్న వాహనం వైసీపీ నేతలదేనని ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం ఆరోపించారు. బీఎన్‌కండ్రిగలో సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ 60 కేసుల మద్యం బయటపడినా పోలీసులు కేసు పెట్టకపోవడం ఏమిటని ప్రశ్నిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ నాయుడు, నియోజక వర్గ నాయిబ్రహణ సంఘం అధ్యక్షుడు వేడాం వెంకటాచలం, ఎంపీటీసీ మనోహర్‌నాయుడు నాయకులు వీరరాఘవులు, శ్రీనివాసులు, సత్యనారాయణ, రవి, మునెయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.